
బుధవారం 25.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 337 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సంవత్సరాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గట్టెక్కించింది. పెట్టుబడులు ఆకర్షించి ఆదాయం పెంచి సంక్షేమం, అభివృద్ధి దిశగా చంద్రబాబు, లోకేష్ కృషి చేస్తున్నారు. అయినప్పటికీ జగన్మోహన్ రెడ్డి విమర్శలు కొనసాగిస్తున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

## కేంద్రం సాయంతో 2028నాటికి

# ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు



- ప్రాజెక్టు అమలు, నిర్వహణపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం
- గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం అవుతుందన్న సీఎం చంద్రబాబు
- మహిళల నీటి కష్టాలు తీరతాయన్న కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్
- జేజేఎం 2.0 ఒప్పంద కార్యక్రమంలోవర్చువల్‌గా పాల్గొన్న ముఖ్యమంత్రి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ పల్లెకు, ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీటిని నిరంతరాయంగా అందించే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జల్ జీవన్ మిషన్ 2.0 కింద 2028 నాటికి రాష్ట్రంలోని ప్రతీ ఇంటికీ తాగునీటి కుళాయి లక్ష్యాన్ని సాకారం చేస్తామని ఆయన వెల్లడించారు. మంగళవారం జల్ జీవన్ మిషన్ 2.0 పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఢిల్లీలో కుదిరిన ఎంఓయూ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ ఆపరేషన్, మెయింటెనెన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించి 2025 సెప్టెంబర్‌లోనే సమగ్ర విధానాన్ని ప్రకటించినట్టు గుర్తు చేశారు. తాగునీటి సరఫరా వ్యవస్థల నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జల్ జీవన్ మిషన్ అమలు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. జల్ జీవన్ మిషన్ 2028 వరకు కొనసాగిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని,


మిగతా 2లో...

## ఉత్తరాంధ్ర... ఇక ఉక్కు ఆంధ్ర

- అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు
- ఎక్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మాట ఇచ్చాం...మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ప్రతిష్టాత్మకమైన ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో.....నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం.
ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే....ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది.

మిగతా 2లో...




## రాజధాని అమరావతిలో నిప్పుపై నిగ్గు తేల్చండి

- పనులు వేగంగా జరుగుతున్న వేళ వరుస ఘటనలు... ప్రమాదాలా, కుట్రలా?
- కారణాలు వెలికి తీయండి : ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతిలో నిప్పుపై నిగ్గు తేల్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాద ఘటనలు నిజంగా ప్రమాదాలా, లేక దాని వెనుక కుట్ర కోణం ఉందా అనేది వెలికి తీయాలని సిఎం ఆదేశించారు. వరుస ఘటనలు, అవి జరుగుతున్న తీరు చూస్తుంటే కుట్ర కోణం ఉందనే అనుమానం వస్తోందని... ఆ దిశగా మరింత లోతుగా అన్ని కోణాల్లోనూ విచారణ జరపాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. గతంలో జరిగిన కొన్ని ఘటనలు... ఇప్పుడు రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని కుట్ర కోణం ఉందా అనే విషయం కూడా విశ్లేషించి వాస్తవాలు బయటకు తీ-యాలన్నారు. రాయపూడిలో హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం వద్ద నిర్మాణ సంస్థకు చెందిన పైపులు

మిగతా 2లో...

## జల్ జీవన్ లక్ష్యాలు చేరుకునేందుకు మరింత సాయం అవసరం



- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మరిన్ని నిధులు మంజూరు చేయండి
- కేంద్ర జల్ శక్తి శాఖకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వినతి
- జల్ జీవన్ మిషన్ 2.0కి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అవగాహన ఒప్పందం
- కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి గ్రామంలో.. ప్రతి ఇంటికీ తాగు నీరు అందించాలన్న జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి మరింత సహకారం అవసరం అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ తెలియ చేశారు. గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ను పూర్తిగా నిర్వీర్యం చేసిందనీ, వారు సమర్పించిన డీపీఆర్ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా ఉందని వివరించారు. కూటమి ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ మరో 13 లక్షల ఇళ్లు జల్ జీవన్ మిషన్ ఎంఓయూ లోని ఆర్టికల్ 1 లక్ష్యాలకు దూరంగా ఉంటాయని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. మంగళవారం జల్ జీవన్ మిషన్ 2.0కి సంబంధించి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఢిల్లీలో కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ సమక్షంలో కేంద్ర ప్రభుత్వం తరఫున జల్ శక్తి మంత్రిత్వశాఖ నుంచి తాగు నీరు మరియు పారిశుధ్య విభాగం జాయింట్ సెక్రటరీ స్వాతి మీనా నాయక్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంచయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

2లో...

## పేదల పెదవులపై చిరునవ్వు...

# తొలిగిన ఆర్డీటీ అడ్డంకులు

- మాట ఇచ్చి మరీ నెరవేర్చిన మంత్రి నారా లోకేష్
- ధన్యవాదాలు తెలియజేసిన ఆర్డీటీ నిర్వాహకుడు మాంచో ఫెర్రర్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పేదోడి నోటి కాడ ముద్ద.. నిరుపేదలకు అందని చదువులను అందించిన విద్యాలయం.. పైసలులేని వారికి రోగమొస్తే నయం చేసే ఆరోగ్యాలయం.. చిన్నారుల చిద్విలాసం.. తెలుగు రాష్ట్రాల వెలుగు కిరణం రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి అడ్డంకులన్నీ తొలగాయి. లక్షలాది ప్రజల ఆశాజ్యోతి ఆర్డీటీని రక్షించుకుంటాం.. అని మాట ఇచ్చిన మంత్రి నారా లోకేష్..అసాధ్యం అనుకున్న పనిని తనదైన శైలి మంత్రాంగంతో సుసాధ్యం చేశారు. కేంద్రంతో మాట్లాడి ఆర్డీటీ అడ్డంకులు తొలగించారు.
ఈ నేపథ్యంలో ఆర్డీటీ నిర్వాహకుడు మాంచో ఫెర్రర్ మంగళవారం ఉండవల్లిలోని నివాసానికి విచ్చేసి మంత్రి నారా లోకేష్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇది ఆర్డీటీ ఒక మంత్రికి చెబుతున్న కృతజ్ఞతలు కాదు, ఆర్డీటీ తరఫున లక్షలాది ప్రజలు మంచిపని చేసిన మంచి మనిషికి అందిస్తున్న ఆశీస్సులు అని చెప్పారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ..నిస్వార్థంగా దశాబ్దాలుగా తెలుగు ప్రజలకు విద్య, వైద్య, ఉపాధి, శిక్షణ ద్వారా ఆర్డీటీ అందిస్తున్న సేవలు ముందు తాను చేసిన పని చాలా చిన్నదని అన్నారు.
ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ కింద స్వచ్ఛంద సంస్థలకు విదేశాల నుంచి వస్తున్న నిధులను నిలిపివేస్తూ కేంద్రం గతంలో ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆర్డీటీకి నిధులు ఆగిపోయాయి. ఈ విషయాన్ని గతంలోనే లోకేష్ దృష్టికి ఫెర్రర్ తీసుకొచ్చారు. తానున్నానని అభయమిచ్చిన లోకేష్ కేంద్ర పెద్దలతో మాట్లాడారు. "లక్షల మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఆశాకిరణం ఆర్డీటీ. ఈ ట్రస్టును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ. ట్రస్టు సేవలు నిరంతరం కొనసాగించేందుకు పూర్తిస్థాయి ప్రయత్నం చేస్తాం" అని ఫెర్రర్‌కు, ప్రజలకు మాటిచ్చిన లోకేష్ తన మాట నిలబెట్టుకున్నారు. సున్నితమైన సమస్యను సమయస్ఫూర్తిగా పరిష్కరించారు. ఆర్డీటీకి విదేశాల నుంచి నిధుల రాకకు మార్గం సుగమం చేశారు. దీనిపై ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి.




## ఇలా అయితే ఎలా?

- నిర్దేశిత గడువు మేరకు పనులు జరిగి తీరాలి
- లేకపోతే అమరావతి రావాల్సి ఉంటుంది
- ఇరిగేషన్ సమీక్ష సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అత్యంత కీలక మైన ఇరిగేషన్ రంగానికి సంబంధించి పనులు శరవేగంతో పూర్తి చేసి ఫలితాలు ప్రజలకు అందివ్వాలని కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తోందని జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. అందులో భాగంగానే ప్రతి పనికి, ప్రతి ప్రాజెక్టుకి గడువు నిర్దేశించుకుని ఆ లోపు పూర్తి చేయాలని లక్ష్యాలు విధించామన్నారు. ఇందుకు సర్వహంగులు ఒడ్డుతున్నామన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు కూడా పదే,పదే చెబుతున్నామని ఆయన చెప్పారు. అయితే ఆచరించాల్సిన అధికార యంత్రాంగం, ఇంజనీరింగ్ నిపుణులు, కాంట్రాక్ట్ ఏజెన్సీలు సంయుక్త బాధ్యతతో, జవాబుదారీతనంతో ముందుకు తీసుకెళ్లాలని, అప్పుడే ప్రజలకు ఇచ్చిన మాట నిలబడుతుందని ఆయన అన్నారు.

మిగతా 2లో...

## పర్యాటక రంగం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి గ్రోత్ ఇంజిన్: మంత్రి కందుల దుర్గేష్



- బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమీక్షా సమావేశం నేపథ్యంలో సచివాలయంలో పర్యాటక శాఖపై మంత్రి దుర్గేష్ ముందస్తు సమీక్ష
- మంత్రి కందుల దుర్గేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు
- విశాఖలో రూ. 100 కోట్లతో అత్యాధునిక అమ్యూజ్‌మెంట్ పార్క్ - రిసార్ట్ ఏర్పాటుకు చర్యలు..ఇప్పటికే సైట్ సందర్శన.. పర్యాటక శాఖ అధికారుల స్పందనపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రతినిధులు

2 లో

## రూ.20 కోట్లతో ఏఐ ఆధారిత హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే మిషన్ల కొనుగోలు।

- రెండు నిమిషాల్లో 'టీబీ' అనుమానిత కేసుల గుర్తింపు
- రాష్ట్రంలో 4,126 హాటుస్పాట్ గ్రామాలను గుర్తించిన కేంద్రం
- ఈ గ్రామాల్లోని 14 ఏళ్లు నిండిన 71 లక్షల మందికి త్వరలో ఉచిత పరీక్షలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- ప్రపంచ క్షయ దినోత్సవ సందర్భంగా అధికారులతో సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** టీబీ (క్షయ) వ్యాధి లక్షణాలు కలిగిన వారిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు ఏఐ అత్యాధునిక 'హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే' మిషన్లను వినియోగించబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. సుమారు రూ.20 కోట్లతో 100 మిషన్లను టెండర్ల ద్వారా త్వరలోనే కొనుగోలు చేయబోతున్నామని వెల్లడించారు. కృత్రిమ మేదస్సు (ఏఐ) అనుసంధానంతో పనిచేసే ఈ మిషన్ల ద్వారా ఇళ్ల ముగింట్లో టీబీ నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 4,126 హాటుస్పాటు గ్రామాల్లో వీటిని వినియోగిస్తామని స్పష్టంచేశారు ఈ గ్రామాల్లో ఉన్న 14 ఏళ్లు నిండిన వారందరికీ ఉచితంగా పరీక్షలు చేస్తామని వెల్లడించారు. 'ప్రపంచ క్షయ దినోత్సవం' సందర్భంగా మంగళవారం మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులతో రాష్ట్రంలో టీబీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు, తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై 'వర్చువల్'గా సమీక్షించారు. ప్రజల్లో అవగాహన పెంచి, పరీక్షల సంఖ్యను పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మరోవైపు జిల్లా కేంద్రాల్లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి.




మిగతా 3లో...

## రూ. 44 కోట్లతో 150 ఆయుష్ ఆరోగ్య కేంద్రాలు

- రెండు నెలల్లోగా ప్రారంభానికి సిద్ధం
- కూటమి ప్రభుత్వ చొరవతో ప్రాచీన వైద్య విధానం బలోపేతం
- వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 150 ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నూతన భవన నిర్మాణాలు, ఆధునీకీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత వైసిపి హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన

మిగతా 3లో...

## పునరుత్పాదక విద్యుత్ రంగంలో

# ఏపీకి అగ్రస్థానమే లక్ష్యం



- రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను త్వరితగతి పూర్తి చేయండి
- పెట్టుబడిదారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

2 లో..

## ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త

# రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ఎంఎస్ఎంఈ బ్యాంకు రుణాలు డబుల్
- పల్నాడు జిల్లా తాళ్లూరులో ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు
- రాష్ట్ర వ్యాప్తంగా పలు ఉత్పత్తుల స్టాల్స్ ప్రదర్శన
- పారిశ్రామిక వేత్తలకు డీఎక్స్ ఎడ్జ్ ద్వారా ప్రభుత్వ సాయం

2 లో

## ఉత్తరాంధ్ర... ఇక ఉక్కు ఆంధ్ర

(మొదటి పేజీ తరువాయి)

రూ. 1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది.

గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శు భాకాంక్షలు.

## ఇలా అయితే ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఆయన వెలిగొండ ప్రాజెక్ట్, పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పురోగతి పై ఇరిగేషన్ శాఖ అధికారులతో, ఏజెన్సీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్స్ లైనింగ్ పనుల విషయంలో టైం షెడ్యూల్ కి అనుగుణంగా పనులు జరగకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతివారం సమీక్ష జరుపుతుంటే ఎప్పటికప్పుడు మెరుగుపరచుకుంటాం అనడంలో అర్థం లేదన్నారు. జాప్యానికి కారకులైన వారు, అమరావతి వచ్చి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది అన్నారు. ఇలా అయితే ఎలా అని ప్రశ్నించారు. వెలిగొండ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పురోగతిపై అధికారులను గణాంకాలు అడిగి తెలుసుకున్నారు.

పోలవరం, హంద్రీనీవా ప్రాజెక్టుల తర్వాత ఆధిక ప్రాధాన్యత పోలవరం ఎడమ ప్రధాన కాలువ, వెలిగొండ ప్రాజెక్టులదే అని ఆయన అన్నారు. సీజన్ మొదలయ్యే లోగా గోదావరి జలాలను అనకాపల్లి వరకు తీసుకెళ్ళేలా పోలవరం ఎడమ ప్రధానకాలువ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. హైవేల క్రాసింగ్ ల దగ్గర వంతెనల నిర్మాణలు వేగంగా పూర్తి చేయాలన్నారు. వారం, వారం వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి పై రిపోర్టు ముఖ్యమంత్రి చంద్రబాబు కి ఇవ్వాలన్న సంగతి మంత్రి నిమ్మల గుర్తు చేశారు. త్వరలోనే నిర్వాసితుల ఖాతాల్లో పునరావాస పరిహారం అందించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. జూన్ నాటికి నల్లమల సాగర్ ను నింపేలా వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారన్నారు. ఈ సమావేశం లో ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సి నరసింహమూర్తి, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈ లు, ఏజెన్సీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జల్ జీవన్ లక్ష్యాలు చేరుకునేందుకు మరింత సాయం అవసరం



(మొదటి పేజీ తరువాయి)

జల్ జీవన్ మిషన్ 2.0 లక్ష్యాలకు అనుగుణంగా 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించే ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర జల్ శక్తి మంత్రిత్వశాఖ సూచించింది.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్న జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లేందుకు నిరంతర మద్దతు అందిస్తున్న ప్రధాన మంత్రినరేంద్ర మోదీకీ, కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు. జల్ జీవన్ మిషన్ 2.0 కింద 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగు నీరు అందించే విధంగా ప్రణాళికలను ముందుకు తీసుకువెళ్తున్నాం. ఆ అశాస్త్రీయమైన డీపీఆర్ కి అనుగుణంగా మంజూరైన నిధులతో పూర్తి స్థాయి లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదు. కేంద్రం నుంచి వచ్చిన మొత్తం నిధులు ఖర్చు చేసినా మరో 13 లక్షల గృహాలు తాగునీటి సరఫరాకు దూరంగా ఉండిపోవాల్సిన పరిస్థితి. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయించాలని కోరుతున్నాము. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున మా విన్నపాన్ని స్వీకరించి రాష్ట్రంలో నిర్దిష్ట లక్ష్యం దిశగా జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేసేందుకు సహకరించాల"ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జల్ శక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి అశోక్ మీనా, జల్ జీవన్ మిషన్ డైరెక్టర్, అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగిపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి

**తిరుపతి, (జర్నలిస్ట్ ఫైల్):** తిరుపతి కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగి నాగరాజుపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏవి నాగేశ్వరరావు, అధ్యక్ష-కార్యదర్శులు కె. అనురాధ, ఎం. గురుస్వామి మాట్లాడుతూ, తిరుపతి నగరంలోని 25వ డివిజన్‌లో వార్డు అడ్మిన్‌గా పనిచేస్తున్న నాగరాజు కుటుంబ సర్వే నిర్వహిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు తమను కూటమి నేతలమంటూ బెదిరించి, విచక్షణ రహితంగా దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా, తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు నాగరాజు మద్యం సేవించి విధులు నిర్వహిస్తున్నాడంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సర్వే పనుల పేరుతో క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేస్తున్నప్పటికీ, వారికి సరైన రక్షణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనిచేసే సచివాలయ ఉద్యోగులకు భద్రత కల్పించాలని సమాఖ్య నేతలు కోరారు.

# ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సంకల్పంతోనే మీవీజు ( సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు ) పని చేస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75 తాళ్లూరులో ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు నిర్వహించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ద్వారా అనేక పథకాలు రాయితీలతో గ్రామాల్లో అమలు అవుతున్నాయని.. వీటిని యువత సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఎదగాలన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ ద్వారా 35 % రాయితీలతో అమలయ్యే పథకాలను కూడా ఉపయోగించుకుని యువత ముందుకు దూసుకు వెళ్లాలన్నారు. రు. 300 కోట్లతో సీఎంఈపీ పథకం అమలవుతోందని మంత్రి తెలిపారు. ఎంఎస్ఎంఈ ద్వారా బ్యాంకులు అందించే రుణాలను డబుల్ చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫిషరీస్ యూనిట్ల ఏర్పాటుకు కూడా రాయితీలతో రుణాలు ఇస్తున్నామన్నారు. ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది డ్వాక్రా సభ్యులతో పారిశ్రామిక/ సేవా / వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయడం జరిగింది. వచ్చే సంవత్సరంలో 5 లక్షల మంది డ్వాక్రా



సభ్యులను పారిశ్రామిక వేత్తలు గా తయారు చేయటం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. పెద్ద పరిశ్రమల్లో కోటి పెట్టుబడి పెడితే ఒకరికే ఉపాధి అని.. చిన్న పరిశ్రమల్లో కోటితో 10 మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రతి మండలంలో రు. 3 – 4 కోట్లతో చిన్న తరహా పరిశ్రమలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తున్నామని రైతులు పండించే పంటలతో స్థానికంగానే ఉత్పత్తులు చేసుకునేలా మెషినరీ సౌకర్యాల ఏర్పాటు ఉంటుందని మంత్రి తెలిపారు. పెద్ద ఇండస్ట్రీలకు అనుబంధంగా మండలాల్లో చిన్న ఇండస్ట్రీలు సైతం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాల కల్పనే మంత్రి నారా లోకేష్ గారు అమరావతి, విశాఖను ఐటీకి కేరాఫ్ నగరాలుగా మార్చేందుకు కంకణం కట్టుకున్నారని మంత్రి కొనియాడారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ – నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో 3 ఏళ్లలో లక్ష ఉద్యోగాలు ఏపీ యువతకు రాబోతున్నాయన్నారు. సంక్షేమం అభివృద్ధిలో ఏపీ దేశంలోనే నెంబర్ 1 స్థానంలో ఉండబోతోందన్నారు. 1995లో జన్మభూమితో గ్రామాలను చంద్రబాబు గారు ఎలా అభివృద్ధి చేశారో... ఇప్పుడు గ్రామాల్లోనూ చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో గ్రామాలను కూడా పారిశ్రామికంగా తీర్చిదిద్దుతున్నారని మంత్రి ప్రశంసించారు.

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ యువకులు ఉద్యోగార్థుల నుంచి ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని, సీఎం నారా చంద్రబాబు నాయుడు గారు, మంత్రి లోకేష్ గారి నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు భారీగా రావడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు భారీగా వస్తున్నాయన్నారు. ఎంఎస్ఎంఈలో తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించుకోవచ్చని.. రుణ పథకాలు, సబ్సిడీలు, శిక్షణ, స్టార్టప్ ప్రోత్సాహకాలు కల్పించడంతో యువతకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

కలెక్టర్ కృత్తికా శుక్లా మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలోని గారపాడులో ఎంఎస్ఎంఈ ప్రాజెక్ట్ కోసం 50 ఎకరాలు సేకరించామని.. ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించి వచ్చే ఆరు నెలల్లో దీనిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అలాగే నరసారావుపేట నియోజకవర్గంలోనూ 30 ఎకరాలు ఈ ప్రాజెక్ట్ కోసం ఏర్పాటు చేశామని... ప్రతి ఒక్కరు లోన్ ఏ ఉద్దేశ్యంతో తీసుకున్నారో అక్కడే పెట్టుబడి పెట్టాలని సూచించారు.

అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ ఉత్పత్తుల స్టాల్స్ ప్రదర్శించారు. ఈ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. బఫే ప్లేట్లు, ప్లాస్టిక్ మీల్ ఐటెమ్స్‌కు ప్రత్యామ్నాయంగా అగ్రివేస్టేజ్‌తో తయారయ్యే మెటీరియల్, బయో డిగ్రేడబుల్ బ్యాగ్స్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. పలువురు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఎంఎంస్ఎంఈ అధికారులు డీఎక్స్ ఎడ్జ్‌తో డీఎస్ఆర్ ( డీటైల్స్ స్ట్రాటజిక్స్ రిపోర్ట్ ) తయారు చేసి వారు మార్కెటింగ్ స్ట్రాటజీ నైపుణ్యం పెంచుకునేలా సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ కృత్తికా శుక్లా, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మారెడ్డితో పాటు ఎంఎస్ఎంఈ సీఈవో విశ్వ మనోహర్, ఎంఎస్ఎంఈ ఛైర్మన్ శివశంకర్ పాల్గొన్నారు.

## కేంద్రం సాయంతో 2028 నాటికి ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

దీనికి కేంద్రం సహకరించాలని ఈ సందర్భంగా సీఆర్ పాటిల్‌ను సీఎం కోరారు. జల్ జీవన్ మిషన్ 2.0 ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం అనంతరం సీఆర్ పాటిల్ మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు జల్ జీవన్ మిషన్ 2.0కు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీతో ఈ విషయంపై సంప్రదించారని, ఈ మిషన్ పొడిగింపు కోసం ప్రతిపాదించడంపై పాటిల్ ధన్యవాదాలు తెలిపారు.



**డ్వాక్రా సభ్యులకు నీటి నాణ్యత పరీక్ష బాధ్యత :** 'జల్ జీవన్ మిషన్ కార్యక్రమం మొదటి దశలో 16 కోట్ల మంది గృహాలకు కుళాయిలు ఇచ్చాం. ప్రాజెక్టులో జరిగిన కొన్ని లోపాలను సవరించి నిర్వహణ కూడా చేపడుతున్నాం. మరో 3 కోట్ల ఇళ్లకు సురక్షితమైన తాగు నీటిని అందించాల్సి ఉంది. ఏపీలో నీటి నాణ్యత ను పరీక్షించేందుకు డ్వాక్రా మహిళల సేవల్ని వినియోగించుకోవాలని కోరుతున్నా. జల్ జీవన్ మిషన్‌ద్వారా వివిధ ప్రాంతాల్లో 9 కోట్ల మంది మహిళలకు దూరం నుంచి నీరు తెచ్చుకునే కష్టాలు తప్పుతాయి. జేజేఎం 2.0 ద్వారా ఏపీలో ప్రతీ ఇంటికి కుళాయి అనే లక్ష్యం నెరవేరుతుందని ఆశిస్తున్నాను. 2047 వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు చేరటం ముఖ్యం. సాగు కోసం కూడా రైతులకు రెండు సార్లు నీరందితే వారు కూడా సంతోషంగా ఉంటారు. జేజేఎం 2.0 పై త్వరలో ఏపీలో జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ మీటింగ్ ఏర్పాటు చేస్తే ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశించు కుందాం. పీఎం జన్ మన్, పీఎం జన్ భాగీదారీ మిషన్‌లో భాగంగానూ సురక్షిత నీటిని మారుమూల ప్రాంతాలకు అందించేందుకు నిధులు వినియోగించుకోవాలని కోరుతున్నా. జల్ జీవన్ మిషన్ సాకారం అయ్యేందుకు కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తాం. ఏపీ పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి.' అని పాటిల్ చెప్పారు.

**2028 డిసెంబర్ నాటికి 'హర్ ఘర్ జల్' :** ఢిల్లీలోని కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ కార్యాలయంలో జేజేఎం 2.0 పై కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంతకాలు చేశారు. తాజా ఎంఓయూతో మౌలిక సదుపాయాల కల్పన, పంచాయతీల ఆధ్వర్యంలో కుళాయిల నిర్వహణ వ్యవస్థను బలోపేతం కానుంది. 2028 డిసెంబర్ నాటికి 'హర్ ఘర్ జల్' సాకారం చేయాలనేది లక్ష్యం. ఢిల్లీలో ఎంఓయూ కార్యక్రమానికి కేంద్ర జల్ శక్తి కార్యదర్శి అశోక్ కుమార్ మీనా, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తదితర ఉన్నతాధికారులు హాజరుకాగా, అమరావతి నుంచి వర్చువల్‌గా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

## పర్యాటక రంగం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి గ్రోత్ ఇంజిన్: మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర పర్యాటక రంగం ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి కీలకమైన 'గ్రోత్ ఇంజిన్'గా మారుతోందని, ఈ రంగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించనున్న సమీక్షా సమావేశం నేపథ్యంలో మంగళవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి దుర్గేష్ తన ఛాంబర్ లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా రాబోయే 15 ఏళ్లకు ఏపీటీడీసీ ఆర్థిక ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో సీఎంతో జరిగిన మీటింగ్ వివరాలు, దిశానిర్దేశం చేసిన అంశాలు, నూతన పెట్టుబడులు, హోటల్స్, హాస్పిటాలిటీ, ఎస్ఐపీబీ లో ఆమోదం పొందిన ప్రాజెక్టు వివరాలు, హోమ్‌స్టేల పురోగతి, కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతి, పర్యాటక ప్రాంతాలకు కల్పిస్తున్న ప్రచారంపై చర్చించారు. గోదావరి పుష్కరాల లోపే 'అఖండ గోదావరి' ప్రాజెక్టును పూర్తి చేయాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. పర్యాటకుల సంఖ్యను పెంచేలా వినూత్న నిర్ణయాలు తీసుకోవాలని, బాధ్యతాయుత పర్యాటకానికి పెద్దపీట వేయాలని, క్రియేటివ్ ఎకానమీ డెవలప్ మెంట్ దిశగా చర్యలుండాలని అధికారులకు మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం చేశారు.



సమీక్షా సమావేశంకు ముందు ఇటీవల ముంబయిలో జరిగిన ×ూూూ× (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్) ఎక్స్‌పో–2026 వేదికగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిన నేపథ్యంలో సంబంధిత ప్రతినిధులు రామ్ ప్రకాష్ మహేశ్వరీ, అంకుర్ మహేశ్వరిలు మంత్రి దుర్గేష్ ను ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారులతో కలిసి విశాఖ వీఎంఆర్డీఏ పరిధిలో దాదాపు రూ.100 కోట్లతో ఏర్పాటు చేయబోయే అత్యాధునిక అమ్యూజ్‌మెంట్ పార్క్ మరియు రిసార్ట్ కు అనువైన స్థలాలు గుర్తించామని మంత్రికి వారు వివరించారు. అనతి కాలంలోనే తమకు పర్యాటక శాఖ అధికారులు అందించిన మార్గదర్శకత్వంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి వహించారని, త్వరితగతిన అనుమతులు మంజూరు చేసేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధమని మంత్రి దుర్గేష్ కు వారికి భరోసానిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'లో భాగంగా వినోద రంగాన్ని రాష్ట్ర పర్యాటక వృద్ధికి ప్రధాన చిహ్నంగా మలిచే లక్ష్యంతో తాము పని చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సమీక్షా సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, పర్యాటక శాఖ ఈడీలు పద్మావతి, శేషగిరిరావు, ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మా రాణి సీలా, ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ సత్యప్రభ, పర్యాటక శాఖ అధికారులు లెజ్యంతి, నాంచారయ్య, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు అనుమతులివ్వండి

- **తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి**
- **ఆటోనగర్ లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయండి**
- **మంత్రి నారాయణకు విన్నవించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. వెలగపూడి సచివాలయంలోని మునిసిపల్ శాఖ సమీక్షలో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు అభివృద్ధిపై మంత్రి నారాయణకు నసీర్ వినతిపత్రం అందించారు. గుంటూరు నగరంలోని



ఆటోనగర్ లో ప్రతి రోజూ వేల మంది కార్మికులు పని చేస్తుంటారని, ఈ ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆటోనగర్ లో వాటర్ ట్యాప్ కనెక్షన్ల ఫీజు తగ్గించాలని విన్నవించారు. మునిసిపాలిటీ పరిధిలోని పరమాయ కుంట, రామిరెడ్డి తోట ప్రాంతాల్లో పేదలకు సంబంధించి ఇళ్లను జీవో నంబర్ 30 ప్రకారం రెగ్యులైజేషన్ చేయాలని కోరారు. బాలాజీ నగర్, ఐపీడీ కాలనీ, నెహ్రూనగర్ మెయిన్ రోడ్డు, నాజ్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్, నాజ్ సెంటర్ నుంచి శనక్కాయల ఫ్యాక్టరీ, మణిపురం బ్రిడ్జి పక్కన రోడ్డు విస్తరణ వంటి పనులకు అనుమతులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 12 చెరువులు ఉన్నాయని, వర్షాకాలంలో పొంగి ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయ మవుతున్నాయని వివరించారు. ఈ చెరువుల అభివృద్ధికి సహకారం అందించాలని విన్నవించారు. టిడ్కో ఇళ్ల పంపిణీకి చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని, మరి కొన్ని ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. వీటి నిర్మాణానికి వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. అన్ని అంశాలపై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు.

## రాజధాని అమరావతిలో నిప్పుపై నిగ్గు తేల్చండి



(మొదటి పేజీ తరువాయి)

గత రాత్రి దగ్ధం అయిన ఘటనపై సచివాలయంలోని తన చాంబర్‌లో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్, ఇంటలిజెన్స్ చీఫ్ మహేష్ కుమార్ లడ్హాలతో సిఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రమద ఘటన గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏ సమయంలో ప్రమాదం జరిగింది... ఎన్నింటికి అగ్నిప్రమాదంపై ఫైరింజన్‌కు కాల్ వచ్చింది అనే విషయాలను సిఎం అడిగి తెలుసుకున్నారు. ప్రమాద స్థలంలో అంత త్వరగా మంటలు వ్యాపించడానికి కారణాలు ఏంటని అడిగి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ ద్వారా ఘటనకు కారణాలను కనిపెట్టాలని సిఎం సూచించారు.

**సిసి కెమేరాలు పెట్టాలి... పెట్రోలింగ్ పెంచాలి :** "రాజధానిలో పెద్దఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కోట్ల విలువైన సామగ్రి రాజధాని ప్రాంతంలో నిల్వచేసి పెట్టారు. పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి... ఇలాంటి సమయంలో జరుగుతున్న ఘటన వల్ల అనవసరమైన అడ్డంకులు ఏర్పడతాయి. ఈ నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాజధాని ప్రాంతంలో, పనులు జరుగతున్న దగ్గర అదనపు పెట్రోలింగ్ నిర్వహించాలి. ప్రతి నిర్మాణ సంస్థ తమ సామగ్రి నిల్వ చేసుకునే యార్డులో సిసి కెమేరాలు తప్పక ఏర్పాటు చేయాలి. అదే విధంగా సామగ్రి నిల్వ కేంద్రాల వద్ద వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. డ్రోన్ కెమేరాలు ద్వారా ఆయా ప్రాంతాల్లో భద్రతను పర్యవేక్షించాలి. తమ సామగ్రి ఉన్న యార్డుల వద్ద తగిన భద్రత ఏర్పాటు చేసుకోవడంతో పాటు, భద్రతా చర్యలు చేపట్టడంపై కూడా నిర్మాణ సంస్థలు దృష్టి పెట్టాలి. అలాగే అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలి. వారి రాకపోకలను కూడా గమనించాలి. అనుమానితులు ఉంటే ప్రశ్నించాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. వరుస ఘటనలో అలజడి సృష్టించాలని ఎవరైనా ప్రయత్నిస్తున్నట్టు తేలితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించ వద్దని... కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు.

## పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఏపీకి అగ్రస్థానమే లక్ష్యం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తల ప్రాజెక్టుల అమలుపై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో బ్రూక్ ఫీల్డ్–యాక్సిస్ ప్రతినిధులు, నెడ్‌క్యాప్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల పురోగతి గురించి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తి చేసి, కమిషన్ చేసే దిశగా పెట్టుబడిదారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అమలు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చిన మంత్రి, అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, ఇతర అనుమతుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని అమలు చేస్తూ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు దేశానికి ఆదర్శంగా నిలువనున్నాయని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానానికి చేరుకునే అవకాశముందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే భవిష్యత్తులో రాష్ట్రాన్ని "బ్యాటరీ స్టోరేజ్ క్యాపిటల్"గా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పాన్ని అధికారులకు గుర్తు చేశారు. పునరుత్పాదక విద్యుత్ రంగ అభివృద్ధితో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పిన మంత్రి గొట్టిపాటి... ఇక పై ప్రాజెక్టుల అమలు, పురోగతిపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ఉన్నతాధికారులు, వివిధ పునరుత్పాదక విద్యుత్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఉన్న వార్డు పరిపాలనా కార్యదర్శిపై దాడి దారుణం

- గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆగ్రహం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి నగరంలోని స్వర్ణ వార్డు పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వార్డు పరిపాలనా కార్యదర్శి నాగార్జునపై జరిగిన దాడిని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ జానీ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

ఇంటి పన్ను బకాయిల వసూళ్లలో భాగంగా స్థానిక ప్రైవేట్ సంస్థ యాజమాన్యాన్ని సంప్రదించిన సమయంలో నాగార్జునపై దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగిపై భౌతిక దాడి చేయడం మాత్రమే కాకుండా అసభ్య పదజాలంతో అవమానించడం అసహ్యకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ సేవకులు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కష్టపడుతున్న నేపథ్యంలో వారిపై ఇలాంటి దాడులు జరగడం చట్టపరమైన విలువలకు విరుద్ధమని తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఉద్యోగులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పన్ను వసూళ్ల విషయంలో పెరుగుతున్న ఒత్తిడి కారణంగా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉదయం నుంచి రాత్రి వరకు పని చేస్తూ మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజల నుండి ప్రతికూల స్పందనలు రావడం, దాడులు చోటుచేసుకోవడం బాధాకరమని అన్నారు.

అందువల్ల పన్ను చెల్లింపులను సులభతరం చేయడానికి డిజిటల్ విధానాలను అమలు చేసి, ప్రజలు బ్యాంకులు, మొబైల్ యాప్‌ల ద్వారా నేరుగా చెల్లించే విధానం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ ప్రకటనను రాష్ట్ర కమిటీ తరఫున షేక్ మొహమ్మద్ జానీ పాషా, బత్తుల అంకమ్మరావు విడుదల చేశారు.

## ఉద్యోగులపై దాడులు అరికట్టాలి

- వైఎస్సార్సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి నగరంలోని స్వర్ణ వార్డు పరిధిలో విధి నిర్వహణలో ఉన్న అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ నాగార్జునపై జరిగిన దాడిని వైఎస్సార్సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన అత్యంత ఘోరమని ఆయన మండిపడ్డారు.

ఇంటి పన్ను బకాయిల వసూళ్ల కోసం వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగిపై ప్రైవేట్ సంస్థ యాజమాన్యం దాడి చేయడం, గాయపరచడం మాత్రమే కాకుండా అసభ్య పదజాలంతో అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు సవాల్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై దాడి చేయడం ప్రభుత్వ వ్యవస్థపై దాడిగా పరిగణించాల్సిన తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు.

ప్రభుత్వ సేవకులు ప్రజలకు సేవ చేయడానికి కట్టుబడి పనిచేస్తున్న సమయంలో ఇలాంటి దాడులు జరగడం అసలు సహించరానిదని తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత ఉద్యోగికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఇటీవల పన్ను వసూళ్ల విషయంలో ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందని, ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం విధులు నిర్వర్తిస్తూ మానసిక, శారీరకంగా అలసటకు గురవుతున్నారని తెలిపారు. సరైన భద్రత లేకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పన్ను వసూళ్ల విధానాన్ని సమీక్షించి, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయాలని, ఫీల్డ్ డ్యూటీల సమయంలో పోలీసు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల గౌరవం, భద్రత కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, ఈ ఘటనపై నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు నిరసనలకు దిగే అవకాశముందని హెచ్చరించారు.


## మానవ అక్రమ రవాణా నివారణపై వర్క్ షాప్ నిర్వహణపై చర్చ



- చర్చలో పాల్గొన్న మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మానవ అక్రమ రవాణా నియంత్రణపై నిర్వహించే వర్క్ షాప్ నిర్వహణపై చర్చ జరిగింది. ఈ చర్చ మంగళవారం నాడు మహిళా కమిషన్ చైర్ పర్సన్ కార్యాలయంలో చైర్ పర్సన్ రాయపాటి శైలజ, మహిళా కమిషన్ అడ్వైజర్ సూయజ్, విజయవాడ రైల్వే డివిజనల్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ షణ్ముగం వడివేల్ ఎస్ చర్చలో పాల్గొని మానవ అక్రమ రవాణా నివారణ పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో శైలజ మాట్లాడుతూ....మానవ అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన కల్పిస్తూ రైల్వే, స్టేట్ పోలీస్, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ క్లబ్స్, విశ్వవిద్యాలయాలలోని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ క్లబ్స్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ,స్వచ్ఛంద సేవా సంస్థలు, ఫోరెన్సిక్ డాక్టర్లు, వన్ స్టాప్ సెంటర్స్( సఖి), మానవ అక్రమ రవాణా నివారణకు విశేష కృషి చేసిన రిటైర్డ్ డిజిపి పీఎం నాయర్ ను వర్క్ షాప్ కు ఆహ్వానించి మానవ అక్రమ రవాణా దుష్ప్రభావాలను వివరించి అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పనిచేసేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. మానవ అక్రమ రవాణా నియంత్రణ కోసం పనిచేసే 112 టోల్ ఫ్రీ నెంబర్, శక్తి యాప్ లపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్న అవసరాన్ని గుర్తు చేశారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు మార్చి 25వ తేదిన గుంటూరులో పర్యటించనున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మంగళవారం గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులో గల శ్రీ కన్వెన్షన్ లో ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్ర, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రూ.20 కోట్లతో ఏఐ ఆధారిత హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే మిషన్ల కొనుగోలు,

(మొదటి పేజీ తరువాయి)

**రెండు నిమిషాల్లో పరీక్ష పూర్తి! :** చేతితో మోసుకువెళ్లే (12 కేజీల బరువు కలిగిన సూటుకేసు) విధంగా ఉండే 'హ్యాండ్ హెల్డ్‌ఎక్స్-రే' మిషన్లను జిల్లాకు సగటున 6 నుంచి 8 వం-కు పంపిస్తామని తెలిపారు. ఈ మెషిన్ ను ఉపయోగించి ఎదుట ఉన్న వ్యక్తి ఛాతీ భాగం వరకు డిజిటల్ ఎక్స్‌రే ఫొటో తీస్తారు. ఎక్స్-రేను కంప్యూటర్లో 30 సెకన్లలో ప్రత్యక్షమవుతుంది. దీని ఆధారంగా ఏఐ ఆధారిత రిపోర్టు తయారవుతుంది ఈ ప్రక్రియలో ఒక్కొక్కరికి రెండు నిమిషాల చొప్పున సమయం పడుతుంది. ఈ రిపోర్టు ఆధారంగా అవసరమైన వారికి తదుపరి చర్యల్లో భాగంగా 'కళ్లె' పరీక్షలు చేస్తారు. వంద మందికి డిజిటల్ ఎక్స్-రే తీస్తే 25% వరకు అనుమానిత కేసులు నమోదయ్యే అవకాశం ఉంది. ఇందులో 5% టీబీ వచ్చినట్లు నిర్ధారణ జరిగే అవకాశం ఉంది.

**ప్రస్తుతం ఆసుపత్రులకు వస్తేనే..! :** ప్రస్తుత విధానంలో రోగులు వారికై వారు ఆసుపత్రులకు వచ్చి వైద్యుల గుర్తించినప్పుడే టీబీ కేసులు బయటపడుతున్నాయి దీనివల్ల ప్రాథమిక స్థాయిలో టీబీ బారినపడిన వారిని గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. కొన్నిచోట్ల ఆశాలు, సీహెచ్ఓలు తమ దృష్టికి వచ్చిన వారిలో టీబీ అనుమానిత లక్షణాలు కలిగిన వారిని గుర్తించి, ఆసుత్రులకు పంపుతున్నారు.





**ఇంటర్నెటు సదుపాయం లేకున్నా మెషిన్లు పనిచేస్తాయి! :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల 47 హ్యాండ్ హెల్త్ ఎక్స్-రే మిషన్లను రాష్ట్రానికి పంపింది వీటి పనితీరు సంతృప్తికరంగా ఉండడంతో వీటి వినియోగాన్ని ఐసీఎంఆర్ సమరించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వంద మిషన్ల కొనుగోలు చేయడానికి ఉపక్రమించింది. కేంద్ర ప్రభుత్వం పంపిన మిషన్లకు ఛార్జింగ్ చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానాన్ని ఉపయోగించుకోవాలనుకుంటే ఇంటర్నెటు సదుపాయం ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలుచేయబోతున్న కొత్త మెషిన్లకు ఇంటర్నెటు లేకున్నా మారుమూల గ్రామాల్లో ఏఐని ఉపయోగించి, రిపోర్టులు పొందవచ్చు ఇదే ఈ మెషిన్ల ప్రత్యేకత.

**ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల కేంద్రాల్లో టీబీ పరీక్షలు :** అత్యాధునిక మెషిన్లను గ్రామాల్లో ఉండే ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల దగ్గరికి తీసుకువెళ్లి, స్థానికులను అక్కడికి రప్పించి, పరీక్షలు చేయనున్నారు. రాష్ట్రంలో 10,032 గ్రామాల్లో ఆరోగ్య మందిరాలు ఉన్నాయి.

**ఈ ఏడాది ఇప్పటివరకు 16,727 కేసులు గుర్తింపు! :** రాష్ట్రంలో 2025లో 78,416 టీబీ కేసులు నమోదయ్యాయి. ప్రతి లక్ష జనాభాకు 146 కేసులు ఉన్నట్లు లెక్క ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 16,727 కేసులు ఉన్నాయి పాత, కొత్త కేసులు కలిపి చికిత్స పొందుతున్న వారు 40వేల మంది వరకు ఉన్నారు. టీబీ వ్యాధితో ఉన్న వారు ఆరునెలలపాటు చికిత్స పొందితే స్వస్తత చేకూరుతుంది రాష్ట్రంలో స్వస్తత రేటు 95.5% వరకు ఉంది. 'నిక్షయ్ మిత్ర' కింద 2025లో దాతలు 22,788 'న్యూట్రిషన్ కిట్ల'ను బాధితులకు ఫ్రీగా అందచేశారు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, నెహ్రూ యువకేంద్రాల వాలంటీర్లు బాధితులకు సపర్యలు చేశారు.

**అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా హాటుస్పాట్ గ్రామాలు! :** టీబీల కేసుల నమోదు ఆధారంగా ఏఐ వినియోగించి, రాష్ట్రంలో 4,126 గ్రామాలను హాటుస్పాట్లుగా సెంట్రల్ టీబీ డివిజన్ గుర్తించింది అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా 612, శ్రీకాకుళం-374, విజయనగరం-317, నెల్లూరు జిల్లాలో 210 చొప్పున గ్రామాలు ఉన్నాయి. తక్కువగా గుంటూరు జిల్లాలో 47, విశాఖ-54, పల్నాడు-69, వెస్ట్ గోదావరి-90, కర్నూలు జిల్లాలో 99 చొప్పున గ్రామాలు ఉన్నాయి. 4,126 గ్రామాల్లో కలిపి 14 ఏళ్లు దాటిన వారు 70 లక్షల మంది ఉన్నారు. లక్షణాలతో సంబంధం లేకుండా టీబీ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. కేసుల నమోదు, పౌష్టికాహారలోపం, వాతావరణ మార్పులు, మద్యం, దూమపాన అలవాట్లు, ఇతర అంశాల ప్రతిపాదికన ఈ గ్రామాలను కేంద్రం ఎంపికచేసింది.

**'టీబీ ముక్త్ పంచాయతీ'ల కింద 1,118 గ్రామాల ఎంపిక :** రాష్ట్రంలో 1,118 గ్రామాలను 'టీబీ ముక్త పంచాయతీ'లుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. 2025లో వెయ్యి జనాభాకు 30 మందికి పరీక్షలు చేసి ఉండడం, ఒక టీబీ కేసు నమోదుకావడం, డీబీటీ ద్వారా నగదును బాధితులకు అందించడం, పౌష్టికాహార కిట్లు అందచేయడంవంటి ప్రమాణాలు అనుసరించి టీబీ ముక్త పంచాయతీల కింద 1,118 గ్రామాలను కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసిందని రాష్ట్ర పర్యవేక్షణాధికారి డాక్టర్ రమేష్ వెల్లడించారు.

# రూ. 44 కోట్లతో 150 ఆయుష్ ఆరోగ్య కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)

భారతీయ ప్రాచీన వైద్య సేవల్ని ప్రజలకు చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే 150 ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను ప్రారంభించామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో వెల్లడించారు. రూ.44 కోట్లతో చేపట్టే ఈ భవనాల నిర్మాణాలు, ఆధునీకీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని, రెండు నెలల్లోగా పూర్తి చేసి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి) చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా ఒకేసారి భారీ ఎత్తున మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. నేషనల్ ఆయుష్ మిషన్ (యీూవీ) 2025-26 వార్షిక ప్రణాళికలో భాగంగా మొత్తం 150 ఆయుష్ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు మరియు ఆధునీకీకరణ పనులకు ఆయుష్ శాఖ నిధులు మంజూరు చేసింది. కొన్ని ఆయుష్ ఆరోగ్య కేంద్రాలు శిధిలావస్థకు చేరుకోగా, మరికొన్ని అరకొర సౌకర్యాలతో ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. ప్రాచీన వైద్య విధానాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఈ దుస్థితి నెలకొంది.





కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆయుష్ వైద్యశాలల రూపురేఖలు మారనున్నాయి. ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణాలు, ఆధునీకీకరణ పనులు జరుగుతున్నాయి.

**50 శాతం పనులు పూర్తి :** 90 ఆయుష్ కేంద్రాలకు ఆధునీకీకరణ పనులు చేపట్టగా, 60 ప్రభుత్వాసుపత్రుల్లో నూతనంగా ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పిహెచ్‌సిలు) 26 , సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో(సిహెచ్‌సిలు) 26, జిల్లా ఆసుపత్రుల్లో 8 ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్ని నూతనంగా నిర్మిస్తున్నారు. 50 శాతం మేర పనులు పూర్తికాగా రెండు నెలల్లోగా మిగతా పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తారు.

**ఐపిహెచ్‌యస్ మార్గదర్శకాల ప్రకారం :** ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ మార్గదర్శకాలు మరియు 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్'ల బ్రాండింగ్ నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలతో భవనాల్ని నిర్మిస్తున్నారు. ఆధునీకీకరణ పనులు, నూతన భవన నిర్మాణాలు అందుబాటులోకొస్తే పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటవుతాయి. మెడికల్ ఆఫీసర్‌కు ఒక రూము, ఫార్మసీకి ఒక రూము, రిసెప్షన్ కు ఒక రూము, టాయిలెట్స్ వంటి సౌకర్యాల్ని కల్పిస్తున్నారు.

**8 జిల్లా ఆసుపత్రుల్లో.. :** జిల్లా ఆసుపత్రుల ప్రాంగణాల్లో నిర్మించే ఒక్కో ఆయుష్ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ. 50 లక్షలు చొప్పున వెచ్చిస్తారు. ఏలూరు, మచిలీపట్నం, ఒంగోలు, చిత్తూరు, కడప, కర్నూలు, నంద్యాల జిల్లా ఆసుపత్రుల్లో నూతనంగా ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్ని నిర్మిస్తున్నారు.

## మెడ్ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** తాడేపల్లి పట్టణంలోని ఆశ్రమం రోడ్డులో నూతనంగా నిర్మించిన మెడ్ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం రాత్రి ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆసుపత్రి మొత్తం కలియతిరిగి అత్యాధునిక వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, మెడ్ స్టార్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బొర్రా విజయ్ చైతన్య, ఛైర్మన్ బొర్రా లక్ష్మీ సింధూర, మెడ్ స్టార్ హాస్పిటల్ డైరెక్టర్ పర్చూరి సాయి కుమార్, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిమ్స్ లోపేదలకు అందుబాటులో మెరుగైన సేవలు.

- గామా కెమెరా (స్పెక్ట్-సిటి) సేవలు
- రేడియోన్యూక్లైడ్ చికిత్స కోసం ప్రత్యేక వార్డ్ ప్రారంభం.
- రూ 10 కోట్ల ఖర్చు తో అందుబాటులోకి అత్యాధునిక సాంకేతిక వైద్య పరికరాలు.
- కార్యనిర్వాహక సంచాలకులు ప్రొఫెసర్ డా. అహంతేమ్ శాంతా సింగ్





**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో న్యూక్లియర్ వైద్య విభాగంలో కొత్తగా అత్యాధునిక స్పెక్ట్-సిటి యంత్రం, అధిక మోతాదు చికిత్స వార్డును సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు ప్రొఫెసర్ డా. అహంతేమ్ శాంతా సింగ్ మంగళవారం ప్రారంభించారు. దీంతో ఆసుపత్రి వైద్య సేవలు మరింత మెరుగుపడ్డాయి.

కొత్తగా ఏర్పాటు చేసిన గామా కెమెరా (స్పెక్ట్-సిటి) ద్వారా శరీరంలోని అవయవాల పనితీరు స్పష్టంగా కనిపిస్తుందని, దీని సహాయంతో వ్యాధులను ముందుగానే గుర్తించి, త్వరగా చికిత్స అందించవచ్చని అహంతేమ్ శాంతా సింగ్ అన్నారు . ఇది ముప్పైకి పైగా రకాల స్కాన్‌లు చేయగలదు.

సుమారు పది కోట్ల రూపాయలు ఖర్చు తో అత్యాధునిక సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజలకు భారంగా కాకుండా పరీక్షల ధరలను రూ.150 నుంచి రూ.1500 వరకు తక్కువగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా థైరాయిడ్ కేన్సర్ రోగులకు ఉపయోగపడే రేడియోన్యూక్లైడ్ చికిత్స కోసం ప్రత్యేక వార్డును కూడా ప్రారంభించారు. దీని వల్ల వ్యాధి మళ్లీ వచ్చే అవకాశాలు తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండే మంచి వైద్య సేవలను అందించడం తమ లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా పేద, వెనుకబడిన ప్రజలకు ఆధునిక చికిత్స అందించడంలో ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పుడీ కొత్త సౌకర్యాలతో, ఈ విభాగంలో పిఇటి-సిటి, స్పెక్ట్-సిటి, అధిక మోతాదు చికిత్సలు అన్నీ ఒకే చోట లభ్యమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు సమీప ప్రాంతాల ప్రజలకు మంచి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ డా. దేశు రామమోహన్, వైద్య అధికారి డా. రాజా శేఖర్ మోహన్, ఉపసంచాలకుడు కల్నల్ శశికాంత్ తుమ్మా, న్యూక్లియర్ వైద్య విభాగాధిపతి డా. బి. శరత్ కుమార్, సహాయ ప్రొఫెసర్ డా. ఆర్. విష్ణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 27నుండి ఐజెయు జాతీయ మహాసభలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ మహా సభలు ఈ నెల 27, 28, 29 తేదీలలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఏపీయూడబ్ల్యూజే తెనాలి శాఖ అధ్యక్షులు, ఐజేయు కేంద్ర సమితి సభ్యులు చందు సుబ్బారావు పేర్కొన్నారు.

మంగళవారం స్థానిక గాంధీ నగర్ లోని ఏపీయూడబ్ల్యూజే కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మహాసభల వివరాలను వెల్లడించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 30 ఏళ్ల తర్వాత నిర్వహించే ఈ 11వ, ప్లీనరీలో 29 రాష్ట్రాల నుంచి 400 మంది పాత్రికేయ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. 28 వ తేదీ సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు

నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని, పాత్రికేయుల సమస్యలపై ఆయన స్పందిస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే మహాసభలకు తెనాలి ప్రాంతానికి చెందిన పాత్రికేయ మిత్రులందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహాసభల బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపియుడబ్ల్యూజే నాయకులు సుధాకర్, వెంకటేశ్వరావు, బొల్లిముంత కృష్ణ మురళి, గోపీచంద్, సాయినాథ్, సుధీర్, శ్రీను, శరత్, ప్రసాద రెడ్డి, కమలాకర్, సత్య, కిరణ్, కళ్యాణ్, సత్యదేవ్, అప్పారావు, నరసింహ, భాస్కర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాల పునర్విభజన 2029 సార్వత్రిక ఎన్నికలలోగా సాధ్యమేనా..?

- స్పష్టత లేని జనాభా గణన

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** భారత పార్లమెంట్ లోపల, దక్షిణాది ముఖ్యమంత్రుల కార్యాలయాల్లో, రాజకీయ పార్టీల వ్యూహ సమావేశాల్లో ప్రస్తుతం ఒకే ఒక ప్రశ్న ప్రతిధ్వనిస్తోంది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ఇప్పుడు సాధ్యమేనా..? 2021 జనాభా గణన ఇంకా అసంపూర్తిగా ఉండగా 2027 సెన్సస్ ఫలితాలు 2028 నాటికే అందుబాటులోకి వచ్చే స్థితిలో ఈ ప్రశ్న భలంగా తలెత్తుతుంది. ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కొత్త రాజకీయ-చట్టపరమైన మార్గం ఏమిటనే దానిపై కూడా ఆధారపడి ఉంది.

రాజ్యాంగం ఆర్టికల్ 82 (లోక్‌సభ) మరియు 170 (అసెంబ్లీలు) ప్రకారం ప్రతి జనాభా గణన తర్వాత డీలిమిటేషన్‌కు రాజ్యాంగం అవకాశం ఇస్తుంది కానీ అది పార్లమెంట్ చట్టం ద్వారా మాత్రమే అమలవుతుంది. "ఒక్కరు-ఒక్క ఓటు" సూత్రాన్ని నిలబెట్టుకోవడమే దీని ఉద్దేశం. అయితే 1971 జనాభా ఆధారంగా సీట్ల కేటాయింపును 1976లో 42వ సవరణ ద్వారా స్తంభింపజేశారు. కుటుంబ నియంత్రణలో విజయం సాధించిన దక్షిణ రాష్ట్రాలను శాపంగా మారకూడదన్న భావనతో ఈ "ఫ్రీజ్"ను 2001లో 84వ సవరణ ద్వారా 2026 వరకు పొడిగించారు. 2008లో 2001 జనాభా



ఆధారంగా సరిహద్దులు మాత్రమే సర్దుబాటు చేశారు, కానీ మొత్తం సీట్ల సంఖ్య (లోక్‌సభకు 543, అసెంబ్లీలకు 4,123) అలాగే ఉండిపోయింది.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కొత్త మార్గం రాజకీయంగా సంచలనాత్మకమైనది. 2011 జనాభా లెక్కలను ఆధారం చేసుకుని మొత్తం సీట్ల సంఖ్యను 50 శాతం పెంచి, మహిళా రిజర్వేషన్‌ను 2029 ఎన్నికలకు ముందే అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. గత రెండు వారాల్లో హోం మినిస్టర్ అమిత్ షా నేతృత్వంలో జరిగిన సమావేశాల్లో ప్రతిపాదనగా చర్చలో ఉన్నది. లోక్‌సభ సీట్లను 543 నుంచి 816కి పెంచడం, అందులో 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేయడం, రాష్ట్ర అసెంబ్లీలను 4,123 నుంచి సుమారు 6,185కి పెంచడం ప్రతిపాదనల సారాంశం.

ఈ ప్రతిపాదనలో అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తి 2011 జనాభా ఆధారంగా ప్రస్తుతం ఉన్నట్లుగానే కొనసాగించడం. అంటే కొత్త జనాభా లెక్కలు ఉపయోగించకపోవడంతో ఉత్తర రాష్ట్రాలు (యూపీ, బీహార్) అంత ఎక్కువ లాభం పొందవు. దక్షిణ రాష్ట్రాలు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక) తమకు జనాభా నియంత్రణ వలన నష్టం భయం నుంచి కొంత ఉపశమనం పొందుతాయి. ఇది రాజకీయంగా చాలా సున్నితమైన సమతుల్యతను సాధించే ప్రయత్నం.

తెలుగు రాష్ట్రాల పరిస్థితిని పరిశీలిస్తే 2011 ఆధారంగా సీట్ల నిష్పత్తి కొనసాగితే తెలంగాణ అసెంబ్లీ 119 నుంచి సుమారు 179కి, లోక్‌సభ 17 నుంచి 26కి పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ 175 నుంచి సుమారు 263కి, లోక్‌సభ 25 నుంచి 38కి పెరగనున్నాయి. ఇవి కేవలం అంచనాలు మాత్రమే. అధికారిక డీలిమిటేషన్ కమిషన్ ఏర్పడిన తర్వాతే ఖచ్చితమైన సంఖ్యలు వెలువడతాయి. ఈ ప్రతిపాదన అమలుకు రాజ్యాంగ సవరణ అవసరం. డీలిమిటేషన్ బిల్లుతోపాటు మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి. దీనికి రెండు-మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ప్రస్తుతం కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీలతో కేంద్రం చర్చలు జరుపుతోంది. మహిళా రిజర్వేషన్ సీట్ల కేటాయింపులో లాటరీ సిస్టమ్ లేదా రొటేషన్ విధానంపై చర్చ కొనసాగుతోంది.

అయితే ఈ మార్గంలో సవాళ్లు లేకపోలేదు. 2011 జనాభా ఆధారంగా 2026 తర్వాత డీలిమిటేషన్ చేయడం రాజ్యాంగ భావనకు విరుద్ధమంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. దక్షిణ రాష్ట్రాలు ప్రస్తుతానికి ఉపశమనం పొందినా భవిష్యత్తులో జనాభా ఆధారంగా సీట్ల పునర్విభజనపై స్పష్టత కోరుతున్నాయి. ఇది కేవలం సీట్ల లెక్క కాదు, ఫెడరల్ భారతదేశ సమతుల్యత గురించి, ప్రాతినిధ్యం గురించి, రాబోయే దశాబ్దాల రాజకీయ సమీకరణాల గురించిన అంశం. అది సాంప్రదాయిక ప్రక్రియ కంటే భిన్నంగా, రాజ్యాంగ సవరణలు మరియు 2011 డేటాను ప్రాతిపదికగా తీసుకున్న రాజకీయ సమ్మతిపై ఆధారపడుతుంది. కేంద్రం ఈ బిల్లులను ప్రస్తుత బడ్జెట్ సెషన్‌లోనే (ఏప్రిల్ 2 వరకు) ప్రవేశపెట్టవచ్చు. ఇది 2029 ఎన్నికలకు ముందు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేస్తుంది. దక్షిణం ఏం చేస్తుంది? ఉత్తరం ఎలా స్పందిస్తుంది? అన్నది మాత్రమే ఇక వేచి చూడాలి.



# సజావుగా పదో తరగతి పరీక్షలు

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 24 (జర్నలిస్ట్ ఫైల్)**

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం నగరంలోని బోయపాటి శివరామకృష్ణయ్య మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, కర్నాటి రాంమోహనరావు మునిసిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. వేసవి నేపథ్యంలో చేసిన తాగునీటి ఏర్పాట్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, వైద్య శిబిరం వంటి సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులు, సిబ్బందికి స్పష్టం చేశారు. మొత్తం 27,360 మంది విద్యార్థులకు 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యార్థులు సజావుగా పరీక్షలు రాసేందుకు సౌకర్యాలు కల్పించామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పటిష్ట బందోబస్తును కూడా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం పొందేలా చూస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి.. సామాజిక చైతన్య జ్యోతి

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 24 (జర్నలిస్ట్ ఫైల్)**



సామాజిక చైతన్య జ్యోతి, శెట్టిబలిజ సంక్షేమ సంఘ స్థాపకులు దొమ్మేటి వెంకటరెడ్డిగారు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషిచేశారని, ఆయన అందించిన స్ఫూర్తి చిరస్మరణీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శెట్టిబలిజ సమాజానికి విద్య, ఐక్యత, గౌరవాన్ని కల్పించిన సామాజిక సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. అధికారులతో కలిసి దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మహనీయులు దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సామాజిక సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సామాజిక సేవతో దొమ్మేటి వెంకటరెడ్డిగారు సమాజంలో తనదైన ప్రత్యేక ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో జర్నలిస్టుల సేవలు ప్రశంసనీయం

- ఏపీపీజేఏ 2026 క్యాలెండర్‌ను
- ఆవిష్కరించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ, మార్చి 24 (జర్నలిస్ట్ ఫైల్)**

సమాజంలోని వాస్తవ సంఘటనలను చిత్రాల రూపంలో ప్రతిబింబిస్తూ వార్తలకు జీవం పోసే ఫోటో జర్నలిస్టుల సేవలు ఎంతో ప్రశంసనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫోటో వెనుక ఒక యథార్థ కథ దాగి ఉంటుందని తెలిపారు. సమాజంలో చోటుచేసుకునే సంఘటనలను క్షణాల్లో బంధించి ప్రజల ముందుకు తీసుకురావడంలో ఫోటో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు, సామాజిక సంఘటనలు వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వృత్తి నిబద్ధతతో పనిచేయడం వారి గొప్పతనమని కొనియాడారు. ఏపీపీజేఏ ప్రతి సంవత్సరం చేపడుతున్న కార్యక్రమాలు సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందించడమే కాకుండా, వృత్తిగత నైపుణ్యాలను మెరుగుపరచడానికి దోహద పడుతున్నాయని ప్రశంసించారు. ఫోటో జర్నలిస్టుల సంక్షేమం కోసం అసో సియేషన్ చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ంలో ఏపీపీజేఏ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, సీనియర్ ఫోటో జర్నలిస్టులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు తమ సంస్థ కార్యకలాపాలు, జర్నలిస్టుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. అనం తరం అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్ డా. జి. లక్ష్మీశను ఘనంగా సత్కరించారు.

# కమ్మనపల్లి మోడల్ స్కూల్ నందు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**బైరెడ్డిపల్లి, మార్చి 24 (జర్నలిస్ట్ ఫైల్)**

బైరెడ్డిపల్లి మండలం కమ్మనపల్లి ఏపీ మోడల్ స్కూల్ నందు 2026--27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించ బడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ప్రకటన ప్రకారం, ఈ ప్రవేశాలు ప్రవేశ పరీక్ష లేకుండా పూర్తిగా మెరిట్ ఆధారంగా నిర్వహించబడతాయి. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.అదేవిధంగా, 6వ తరగతి ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తుల చివరి తేదీ 31-03-2026గా నిర్ణయించబడింది.దరఖాస్తు కాలం (ఇంటర్): 18-03-2026 నుండి 30-04-2026 వరకు.దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్లు:http://apms.apcfss.in.http://cse.ap.gov.in . దరఖాస్తు ఫీజు: ఓసీ / బీసీ / ఈ డబ్ల్యు ఎస్: 200 ఎస్ సీ / ఎస్ టి : 150ఎంపిక విధానం: అర్హులైన అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించబడతాయి.ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులు మరియు ఇతర అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరడమైనది.మరిన్ని వివరాలకు పై పేర్కొన్న వెబ్‌సైట్లను సందర్శించగలరు లేదా పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించగలరు.

# జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు తీసుకోండి





- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ను కోరిన ఏపీఎంపీఏ నాయకులు

**విజయవాడ, మార్చి 24 (జర్నలిస్ట్ ఫైల్)**

జర్నలిస్టుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడంతో పాటు నగరంలో జర్నలిస్టులకు ప్రత్యేక ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఏపీ ఎంపీ ఏ) ప్రతినిధులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నగర, జిల్లా అధ్యక్షులు తాళ్లూరి అనిల్ కుమార్, బొడ్డు విజయ్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాఖమూరి మల్లికార్జునరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేమినేని వెంకటరమణ, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్యతో పాటు నగర, జిల్లా నాయకులు కలెక్టర్‌ను కలిసి రెండు మెమోరాండంలను సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోనే అత్యధికంగా అక్రిడిటేషన్లను పారదర్శకంగా నిర్వహించి అందజేసినందుకు కలెక్టర్‌కు శాలువా కప్పి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ సేవలను ప్రశంసించారు. వినతిపత్రాల్లో ప్రధానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్, నివాస స్థలాలు, బ్యాంకు రుణాలపై సబ్సిడీలు కల్పించడంతో పాటు నగరంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ప్రెస్ క్లబ్ భవనం ఏర్పాటు చేయాలని స్పష్టంగా కోరారు. జర్నలిస్టులు సమావేశాలు, చర్చలు, వృత్తి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రెస్ క్లబ్ ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరంలో అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని సూచించారు. జిల్లాలో సుమారు 2000 మంది పైగా జర్నలిస్టులు ఉన్నప్పటికీ వారికి తగిన సదుపాయాలు అందడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్,కోటా రాజా నాయకులు శ్రీధర్, ఎన్ శ్రీనివాసరావు, ప్రభాకర్, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు మరకాల గోపి, ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశ్, కోశాధికారి మల్లెల శ్రీనివాసరావు, మెటికల శ్రీనివాస రావు, తోట ప్రసాద్,రవి, కృష్ణారెడ్డి, వైడీపీ రెడ్డి, ఎస్‌కే వలి, శ్రీధర్ రాజా, మల్లి సర్వేశ్వరరావు, మైలవరం నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ పామర్తి సత్య, కార్యదర్శి మల్లాది తిరుపతిరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ మన్నే సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు.

# ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలి

- నిర్దిష్ట గడువులోపు సమస్య పరిష్కారానికి కృషిచేయాలి
- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 112 అర్జీలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 24 (జర్నలిస్ట్ ఫైల్)**



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. జేసీ ఇలక్కియ, అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 112 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు 31, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 24, పోలీసు శాఖకు 14, పంచాయతీరాజ్‌కు 9 అర్జీలు వచ్చాయి. విద్యుత్ 4, ఆరోగ్యం 4, విభిన్న ప్రతిభావంతుల శాఖ 3, ఇరిగేషన్‌కు 3 అర్జీలు వచ్చాయి. ఇదేవిధంగా డీఆర్‌డీఏ, విద్య, దేవాదాయ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. వ్యవసాయం, పశుసంవర్థక, జెడ్‌పీ సీఈవో, పౌరసరఫరాలు, సహకార, అడవులు, గృహనిర్మాణం, కార్మికశాఖ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, రహదా రులు-భవనాలు, గ్రామీణ నీటి సరఫరాకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కు అత్యంత ప్రాధాన్యమిస్తోందని.. ఈ కార్య క్రమం ద్వారా ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అధికా రులతో నిరంతర సమన్వయంతో అర్జీల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసిహం, పీజీఆర్ఎస్ కోఆర్డినేటర్ జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలే వడదెబ్బ నుంచి రక్షణ

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 24 (జర్నలిస్ట్ ఫైల్)**



వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ (హీట్ స్ట్రోక్) బారిన పడకుండా ప్రజలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. ఈ జాగ్రత్తలే మనకు వడదెబ్బ నుంచి రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి వడదెబ్బ నివారణకు సంబంధించిన జాగ్రత్తలతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం వేళల్లో అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని, బయటకు వెళ్లినప్పుడు తలపై రక్షణ కోసం టోపీ లేదా గొడుగు వంటివి ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా తగినంతగా నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీరు వంటి ద్రవాలు తరచుగా తీసుకోవాలని.. వదులుగా ఉండే లేతరంగు కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రజా ప్రదేశాల్లో ఈ పోస్టర్లను ప్రదర్శించి విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఎం.సుహాసిని, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ నీటి దినోత్సవంపై అవగాహన సదస్సు

**మైలవరం, మార్చి 24 (జర్నలిస్ట్ ఫైల్)**



స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం "ప్రపంచ నీటి దినోత్సవం" సందర్భంగా ప్రకృతి - ఎన్విరాన్మెంట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో బి.టెక్ విద్యార్థిని , విద్యార్థులకు "స్థిరమైన నీటి సంరక్షణ పద్ధతులు" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా కె.అప్పారావు మాట్లాడుతూ నీరు మన జీవనానికి అత్యంత ముఖ్యమైన సహజ వనరు. అయితే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నీటి కొరత తీవ్రంగా పెరుగుతోంది. జనాభా పెరుగుదల, నీటి వనరుల అధిక వినియోగం, కాలుష్యం వంటి కారణాల వల్ల భూగర్భ జలాల స్థాయి రోజురోజుకూ తగ్గిపోతోంది. ఈ పరిస్థితిలో భవిష్యత్తు తరాలకు సరిపడేలా నీటిని సంరక్షించడం చాలా అవసరమని మరియు స్థిరమైన నీటి సంరక్షణ అంటే, నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించడం మరియు అందుబాటులో ఉన్న వనరులను సక్రమంగా నిర్వహించడం. వర్షపు నీటి సంగ్రహణ ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చు. ఇళ్ల పైకప్పులపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి చొప్పించడం ద్వారా నీటి నిల్వ పెరుగుతుందని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో నీటి వృథాను తగ్గించడం ఎంతో ముఖ్యమైనది. చిన్న చిన్న చర్యలు, ఉదాహరణకు లీకేజీలను సరిచేయడం, అవసరానికి మాత్రమే నీటిని ఉపయోగించడం వంటివి పెద్ద మార్పును తీసుకురాగలవు. వ్యవసాయంలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ పద్ధతులను ఉపయోగించడం ద్వారా నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.ని తెలిపారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు "స్థిరమైన నీటి సంరక్షణ పద్ధతుల పై పోస్టర్ ప్రెసెంటేషన్ ను నిర్వహించి అందులో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను అందచేశారు ఈ కార్యక్రమానికి డా.బి. సామ్రాజ్య లక్ష్మి, ఇంగ్లీష్ ప్రొఫెసర్, ఫ్రెష్‌మన్ ఇంజినీరింగ్ విభాగం వారు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి క్లబ్ కోఆర్డినేటర్స్ డా.షాహిదా నీలోఫర్, డా.వి.భాగ్యలక్ష్మి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## టిబి రహిత జిల్లాగా ఆవిర్భవించాలి



○ గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పిలుపు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** క్షయ వ్యాధి (టిబి) రహిత జిల్లాగా ఆవిర్భవించుటకు సమష్టిగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి (టిబి) దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ

క్షయ వ్యాధికి సరైన సమయంలో పరీక్షలు చేయించుకొని, వైద్యుల సూచనల మేరకు పూర్తి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందన్నారు. “టిబి నిర్మూలనకు సమష్టి కృషి అవసరం” థీమ్ తో ఈ సంవత్సరం టిబి దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు, ఆరోగ్య శిబిరాలు, ఉచిత పరీక్షలు, ఔషధాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు అందరూ టిబి పట్ల శ్రద్ధ వహించి టిబి రహిత భారత్ కు, టిబి రహిత జిల్లాకు సహకరించాలని చెప్పారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. టిబి పరీక్షలు, మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా లభిస్తాయన్నారు. టిబి రోగులతో బంధాన్ని కొనసాగించి, త్వరగా నయం కావడానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే పుట్టా



○ ప్రజలనుండి వినతులు స్వీకరించి తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే..

**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు క్యాంపు కార్యాలయంలో మంగళవారం శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ప్రజా దర్బార్ నిర్వహించిన నేపథ్యంలో ప్రజలు ప్రతి సమస్యను ఫిర్యాదు రూపంలో ఎమ్మెల్యే కార్యాలయంలో సమర్పించాలి అని సిబ్బంది కి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి ఎన్ని పరిష్కారం అయ్యాయి వాటి స్థితిగతులను విజన్ ఆఫీసర్ వినోద్ ను అడిగి ఎమ్మెల్యే ఆరా తీశారు. మైదుకూరు మున్సిపాలిటీ 12వ వార్డులో దారి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేని కోరిన మహిళలు తక్షణమే దారి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా సీఎం కార్యాలయానికి వెళ్లి అక్కడ నుండి కలెక్టర్ కార్యాలయానికి వస్తాయి అని సమస్యల పరిష్కారం కాకపోతే కలెక్టర్ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటారు అని పరిష్కారం తరువాత సీఎం ఓ కార్యాలయం నుండి ఫోన్ కాల్ ద్వారా అభిప్రాయం సేకరిస్తారని సమస్య పరిష్కారం కాలేదని చెబితే ఆ సమస్యపై కలెక్టర్ చర్యలు తీసుకుంటారని వచ్చిన ప్రతి ఫిర్యాదు సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుందని ప్రతి ఫిర్యాదు దాని ప్రియారిటిని బట్టి నిర్ణిత సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు అని ప్రజా సమస్యల పరిష్కార వేదిక చాలా పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రజలు సమస్యలు ఉన్నాయని చెప్పడం కన్నా ఫిర్యాదు రూపంలో కార్యాలయంలో అందజేయాలి. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోండి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రజలకి తెలిపారు.

## పౌరసరఫరాల గిడ్డంగిని ఆకస్మిక తనిఖీ చేసిన జెసి. అశుతోష్ శ్రీవాత్సవ



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** వంట గ్యాస్ డిమాండ్ కు తగిన విధంగా డెలివరీ ఏర్పాట్లు మెరుగుపర్చి గ్యాస్ బుక్ చేసుకున్న వారికి కొరత లేకుండా అందేలా చూస్తామని జెసి అశుతోష్ శ్రీవాత్సవ పేర్కొన్నారు.

స్థానిక పినపాడులోని సివిల్ సప్లయస్ గిడ్డంగిని జెసి శ్రీవాత్సవ, ఒఎస్డి తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణలతో వెళ్ళి, వాస్థవ పరిస్థితి తెలుసుకున్నారు. గిడ్డంగి రిజిష్టర్ పరిశీలించారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్న వారికి నిర్ణీత గడువులో, గ్యాస్ సరఫరా చేయని పరిస్థితిని గమనించారు. ఇదే క్రమంలో గిడ్డంగికి 2లోడ్స్ సిలండర్లు వచ్చాయి. సంబందిత సిబ్బందికి సక్రమంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీకి తగు సూచనలు చేసిన, జెసి అశుతోష్ శ్రీవాత్సవ మీడియాకు వాస్థవ పరిస్థితిని వివరించారు. గృహ అవసరాలకు వంటగ్యాస్ కొరత లేదని, త్వరలోనె, డిమాండ్ కు తగిన విధంగా సప్లయ్ జరిగేలా పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామన్నారు. పండుగ సెలవుల వల్ల, కొంత గ్యాప్ వచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో గిడ్డంగి సిబ్బంది ఉన్నారు.

## తెనాలి పురపాలక సంఘాన్ని రాష్ట్రంలో 5వ స్థానంలో నిలబెడతాం : మంత్రి నాదెండ్ల



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి పురపాలక సంఘం రాష్ట్రంలో అయిదో స్థానంలో నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు, ఉద్యోగులు మార్పు కనిపించేలా పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలని, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు ఉద్యోగులకు సూచించారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టణభివృద్ధి, పారిశుధ్య నిర్వాహణ, రెవిన్యు అంశాలపై ఆయాశాఖల అధికారులు, ఉద్యోగులతో సమీక్షించారు. ఈక్రమంలో మున్సిపల్ కార్యాలయ స్పెషల్ ఆఫీసర్,జెసి,అశుతోష్ శ్రీవాత్సవ మంత్రి మనోహర్ సమక్షంలో బాద్యతలు చేపట్టారు. ప్రధాన అధికారులు, ఉద్యోగులు సమక్షంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మనోహర్ పలు కీలక అంశాలపై దృష్టి సారించారు. తొలుత ఆస్తిపన్ను వసూళ్లపై ఆరా తీసారు. కనీసం 95 శాతం వసూళు సాధించేలా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి మున్సిపాలిటీకి రావాల్సిన రూ. 9 కోట్ల నిధులను త్వరితగతిన వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.

టెండర్లు పొంది పనులు సకాలంలో ప్రారంభించని,లేదా పనులు నిర్వాహణలో జాపయం చేస్తున్న కాంట్రాక్టర్లపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అదే క్రమంలో సకాలంలో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు వెంటనే చెల్లించాలని ఆదేశించారు.

పట్టణంలో అసంపూర్తిగా ఉన్న భవనాల వివరాలు సేకరించి, వాటి పూర్తి చేయడం కోసం ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. ఖాళీగా ఉన్న పురపాలక భవనాలను గుర్తించి, ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న సచివాలయాలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలను స్వంత భవనాల్లోకి మార్చాలని సూచించారు.

అదేవిధంగా ఐతానగర్‌లోని ఫైకస్ పార్క్ అభివృద్ధి పనులను ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేసి, మే నెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి మనోహర్ ఆదేశించారు. అమరావతి ప్లాట్స్‌లోని రెండు పార్కులను కూడా త్వరలో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ప్రజా సమస్యలపై తక్షణ స్పందన అవసరమని, అధికారులు ప్రజలతో మర్యాదగా వ్యవహరించి పట్టణంలో స్పష్టమైన మార్పు తీసుకురావాలని సూచించారు. మే మొదటి వారంలో పట్టణంలోని ప్రధాన కాల్వలు, ఇరిగేషన్ కాల్వల మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తూ ఖాళీ స్థలాల అభివృద్ధి కోసం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ స్పెషల్ ఆఫీసర్,జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, మంత్రి వర్యుల సహకారంతో జిల్లాలో 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ఓ మంచి జ్ఞాపకమన్నారు. ఆమెమరీ జిల్లాలో రికార్డుగా నిలిచిందన్నారు. వచ్చే ఏడాది లక్ష మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

అదేవిధంగా తెనాలి మున్సిపల్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని చెప్పారు. త్వరలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చ జరుపుతామని చెప్పారు. అధికారులు నిర్దిష్ట లక్ష్యాలతో గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎమ్ ఇ, పి. శ్రీకాంత్, మేనేజర్ కె. విల్సన్ జయకర్, ఏసీపీ వాణి, ఆర్వో రాంప్రసాద్, మెప్మా సీఎంఎం విజయకుమారి, ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు, హౌసింగ్ ఈఇ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ స్టేడియానికి మహర్దశ తీసుకొస్తాం

○ 26న బీఆర్ స్టేడియంలో మల్టీపర్పస్ భవనానికి శంకుస్థాపన

○ ఖేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రూ.14 కోట్ల కేటాయింపు

○ 19 రకాల క్రీడలకు అనుకూలంగా రెండు అంతస్తుల్లో భవన నిర్మాణం

○ ప్రారంభించనున్న కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని

○ ఏర్పాట్లను పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోనే అతి పెద్దదైన గుంటూరు నగరంలోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియానికి మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియాన్ని ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బీఆర్ స్టేడియంలో ఈ నెల 26వ తేదీన కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతులమీదుగా మల్టీపర్పస్ భవన సముదాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం రూ. 170 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశామని వెల్లడించారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం, శానిటేషన్, నూతన భవన నిర్మాణాలు వంటి అభివృద్ధి పనుల నిర్వహణ చేపట్టనున్నామని తెలిపారు. ఖేల్ ఇండియా కార్యక్రమంలో బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం 14 కోట్ల రూపాయల నిధులు మంజూ-రయ్యాయని, వీటితో మల్టీపర్పస్ భవన సముదాయం నిర్మించబోతున్నామని వెల్లడించారు. 80 అడుగుల విస్తీర్ణంలో రెండు అంతస్తుల్లో నిర్మించే నూతన భవన సముదాయంలో బ్యాడ్మింటన్, షటిల్, బాస్కెట్ బాల్ క్యారమ్స్, స్క్వాష్, డార్మిటరీ ఇలా 19 విభాగాలకు రూములు ఉంటాయని వెల్లడించారు. ప్రతి ఏటా కొంత నిధులు రాబట్టి బ్రహ్మానంద రెడ్డి స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో బ్రహ్మానంద రెడ్డి స్టేడియాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేయడంతో అధ్వాన స్థితికి చేరిందని, దీంతో కుక్కలు సంచరించేవని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రథమంగా బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధి కోసం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నానని తెలిపారు. శానిటేషన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటి పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం, క్రీడల ప్రోత్సాహానికి ముందడుగు వేసిందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## టిడ్ కో గృహ సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** టిడ్కో గృహ సముదాయాల్లో సమగ్ర మౌలిక వసతుల కల్పన చేసి, నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ టిడ్కో ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం వెంగళాయపాలెంలోని టిడ్కో గృహ సముదాయాలు, గోశాల తదితర ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్ లో ఉన్న టిడ్కో గృహసముదాయాలను త్వరలో లబ్దిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సదరు గృహసముదాయానికి ట్రీట్మెంట్ చేసిన నీటిని అందించాలని, స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటుకు సిపిడిసిఎల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. టిడ్కో గృహసముదాయాల్లో చేపట్టిన పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. రోడ్ల వెంబడి మొక్కలు నాటడం, ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయాలన్నారు. సేవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనితీరుని పరిశీలించి, నిర్దేశిత మార్గదర్శకాల మేరకు ప్లాంట్ పని చేయడం లేదని, సదరు ఏజన్సీ ప్రతినిధులను పిలిచి మాట్లాడాలన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లో స్థానికుల ఫిర్యాదు మేరకు తక్షణం పిచ్చి మొక్కలను జేసిబితో శుభ్రం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, ప్రతి రోజు చెత్త సేకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అనంతరం జిఎంసి గోశాలని పరిశీలించి, ఎన్ని ఆవులు ఉన్నదీ, విధుల్లో ఉన్న సిబ్బంది, మౌలిక వసతుల వివరాలను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని, చూడి ఆవులకు ప్రత్యేకంగా షెడ్ ని ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గోశాలకు తరలించిన ఆవుల ఆరోగ్య స్థితిని, వాటికి ఆహారం సక్రమంగా అందేలా వెటర్నరీ అసిస్టెంట్ పర్యవేక్షణ చేయాలన్నారు.

పర్యటనలో జిఎంసి సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ సి. సుబ్బారాయుడు, డిసిపి సూరజ్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, విఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, ఈఈ విష్ణు, డిఈఈ శ్రీనివాస్, బయాలజిస్ట్ శేషయ్య, ఉపా సెల్ పిఓ సింహాచలం, ఎస్ఎస్ రాజేష్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



○ 41 మందికి రూ.32 లక్షల చెక్కుల పంపిణీ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ =వశ్రీఱవట ఖీబఅఎ) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... అత్యవసర వైద్య అవసరాలు మరియు ఇతర కష్టకాల పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ రోజు ఒక్కరోజే మొత్తం 41 మందికి రూ. 32,37,844/- విలువైన చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సహాయం ద్వారా అనేక కుటుంబాలకు ఉపశమనం కలిగిందని ఎమ్మెల్యే తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందుతోందని, ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

ఇప్పటివరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 505 మంది లబ్ధిదారులకు రూ. 6,77,85,662/- విలువైన సహాయం అందజేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారి పాల్గొన్నారు.

## డొమెస్టిక్ గ్యాస్ వినియోగంపై మెరుపు దాడి చేసిన విజిలెన్స్ అధికారులు



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు పట్టణంలోని హోటల్ల పై విజిలెన్స్ సివిల్ సప్లై అధికారులు మంగళవారంఆకస్మిక దాడులు చేపట్టారు గృహ వినియోగానికి వినియోగించే ఎల్పిజి సిలిండర్లను వాణిజ్యానికి వినియోగిస్తున్న వ్యాపారుల నుండి ఆరు సిలిండర్లు స్వాధీనం చేసుకొని అట్టి వ్యాపారులపై అధికారులు రెండు కేసులు నమోదు చేయటం జరిగింది నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారి లక్ష్మణ్ తెలిపారు.

## మోదీ చారిత్రాత్మక పాలన



○ బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుదీర్ఘకాలంగా ప్రభుత్వాన్ని నడిపిస్తూ దేశంలోనే అత్యధిక కాలం సేవలందించిన ప్రభుత్వ అధినేతగా నిలవడం విశేషమని బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు దేశానికి స్థిరత్వం, స్పష్టమైన దిశానిర్దేశం అందించిన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. వరుసగా మూడు లోక్సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన మద్దతు మోదీపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. మోదీ పాలనలో పారదర్శకత, అవినీతి రహిత వ్యవస్థ, సంక్షేమం-అభివృద్ధి సమన్వయం స్పష్టంగా కనిపించాయని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు. అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ఠ మరింత పెరిగిందని,‘వికసిత్ భారత్’ లక్ష్యంతో దేశం వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. మోదీ సుదీర్ఘ సేవా కాలం ప్రజల విశ్వాసానికి ప్రతిబింబమని, భవిష్యత్తులో కూడా దేశాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపిస్తారని అన్నారు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహించడం విశేషమని అన్నారు. పారదర్శక రాజకీయాలు, అవినీతి రహిత పాలన, దేశ ప్రథమ విధానం ఆయన పాలనలో ప్రతిఫలించాయని తెలిపారు. మోదీ నాయకత్వంలో బీజేపీ మూడు వరుస లోక్సభ విజయాలను నమోదు చేయడంతో పాటు అభివృద్ధి దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తుందన్నారు. స్థిరత్వం, నిష్పాక్షికత, దేశసేవ పట్ల అంకితభావానికి నిదర్శనమని తెలియజేసారు.

## స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక విప్లవం : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ మరియు నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న భారీ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక కొత్త యుగం మొదలైందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. దేశ ఉక్కు తయారీ సామర్థ్యాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే ఈ సమీకృత ఉక్కు కర్మాగారానికి కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఘనంగా శంకుస్థాపన చేయడం జరిగింది. సుమారు రూ. 1,35,964 కోట్లకు పైగా భారీ పెట్టుబడితో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్, దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలవడమే కాకుండా, రాష్ట్రానికి పెద్ద ఎత్తున గర్వకారణంగా నిలుస్తుందని చీఫ్ విప్ జీవి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష మరియు పరోక్ష ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని, దీనివల్ల స్థానిక యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి



లభించడమే కాకుండా స్కిల్ డెవలప్మెంట్, టెక్నికల్ ట్రైనింగ్ మరియు అనుబంధ పరిశ్రమల ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు.

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్”, పారదర్శక పాలసీలు మరియు వేగవంతమైన అనుమతులే ప్రపంచ స్థాయి కంపెనీలను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించాయని, ఇది ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని జీవీ ఆంజనేయులు కొనియాడారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ గారి నిరంతర కృషి, పెట్టుబడిదారులతో జరిపిన చర్చలు మరియు కేవలం ఒక జూమ్ కాల్‌తోనే ఇంతటి భారీ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడం అభినందనీయమని ప్రశంసించారు. “జీశీఎం ఖీఱతీర్” విజన్‌తో యువత ఉపాధిని లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న ఈ ప్రాజెక్టు, రాష్ట్రాన్ని పారిశ్రామిక ఆవిష్కరణల్లో అగ్రగామిగా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్లాంట్ రాకతో ఉత్తరాంధ్ర ఇండస్ట్రియల్ హబ్‌గా మారి పోర్ట్ కనెక్టివిటీ, రైల్వే మరియు రోడ్డు సదుపాయాలు మెరుగుపడతాయని, తద్వారా మీవీజులు మరియు స్థానిక ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతం లభిస్తుందని వివరించారు. విశాఖను రాష్ట్ర ఆర్థిక రాజధానిగా మార్చడంలో ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుందని, ఇది కేవలం ఒక స్టీల్ ప్లాంట్ మాత్రమే కాదని, ఏపీ యువత భవిష్యత్తును మార్చే ఒక ఉపాధి యంత్రమని ఆయన అభివర్ణించారు.

ఈ భారీ ప్రాజెక్టును రెండు దశల్లో నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం 5,465 ఎకరాల్లో విస్తరించే ఈ ప్లాంట్ మొదటి దశలో ఏడాదికి 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తిని, రెండో దశలో 10.5 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళుతుందన్నారు. 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్ట్ ఫర్నేస్ మరియు డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ అందుబాటులోకి రానున్నాయని సమాచారం అందించారు. దీనికి అనుబంధంగా రూ. 11,192 కోట్లతో 316 ఎకరాల్లో 50 మీూూ సామర్థ్యం కలిగిన క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మించబోతున్నారని, దీని ద్వారా అదనంగా 6 వేల మందికి ఉద్యోగాలొస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు పట్ల స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేయడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దక్కిన గౌరవమని జీవీ ఆంజనేయులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సీఎం చంద్రబాబుతో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ భేటీ



○ ఏపీలో సినిమా షూటింగ్‌లు, ఫిలిం ప్రొడక్షన్ అంశాలపై చర్చ

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించి ఇద్దరి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో సినిమా రంగానికి సంబంధించి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు సంజయ్ దత్ ముఖ్యమంత్రికి వివరించారు. సినిమా షూటింగ్‌లకు ఏపీని కేంద్రంగా చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఉన్న అవకాశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఫిలిం స్టూడియోలు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా ప్రణాళికలు ఉన్నామని సంజయ్ దత్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తద్వారా సినిమా, వినోద రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముఖ్యమంత్రి సంజయ్ దత్‌ను కోరారు.

## అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి



○ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** అంబేద్కర్ జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా కోస్తాంధ్ర జోన్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ, ఏప్రిల్ 5 నుంచి 14 వరకు జరిగే బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ప్రతి జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలన్నారు.

రాష్ట్రంలోని ప్రధాన అంబేద్కర్ విగ్రహాల కూడళ్ల వద్ద 2,000 మందికి పైగా పాల్గొనే విధంగా బైక్ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో నాలుగు జోన్లలో చేపట్టే సమరసత మారథాన్, 10,000 మంది డప్పు కళాకారుల సమావేశం, రక్తదాన శిబిరాలు, కబడ్డీ పోటీలు విజయవంతం కావడానికి ప్రతి ఎస్సీ మోర్చా నాయకుడు బాధ్యత వహించాలని కోరారు.

కోస్తాంధ్ర జోన్‌లోని అన్ని జిల్లాల్లో ఎస్సీ మోర్చా కమిటీలను త్వరితగతిన పూర్తి చేసి, రాష్ట్రవ్యాప్తంగా సంస్థను బలోపేతం చేయాలని సురేష్ సూచించారు.

ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేద్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాయపూడి ఏసుబాబు, గట్టుపల్లి అబ్రహం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కంతేటి బ్రహ్మయ్య, వల్లూరి గంగాధర్, జోనల్ ఇంచార్జ్ మేకల లక్ష్మణ్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు మేళం మధుబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల ఎస్సీ మోర్చా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.

## కొంగాడ్‌లో బీజేపీ అభ్యర్థి రేణు సురేష్ విస్తృత ప్రచారం



**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** కేరళలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొంగాడ్ నియోజకవర్గంలో బీజేపీ ప్రచారం ఊపందుకుంది. బీజేపీ అభ్యర్థి డాక్టర్ రేణు సురేష్ స్థానిక ప్రజలతో మమేకమవుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారని కొంగాడ్ అసెంబ్లీ ఎన్నికల ఇంచార్జ్ డాక్టర్ కిలారు దిలీప్ తెలిపారు.

ఈ సందర్భంగా డాక్టర్ కిలారు దిలీప్ మాట్లాడుతూ, డాక్టర్ రేణు సురేష్‌తో కలిసి మన్నూర్ ప్రాంతంలోని ప్రసిద్ధ స్థానిక దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించామని చెప్పారు. అనంతరం అక్కడి భక్తులు, స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నామని పేర్కొన్నారు. ప్రజల్లో బీజేపీకి మంచి ఆదరణ కనిపిస్తోందని, పలువురు ఓటర్లు పార్టీకి మద్దతు ప్రకటించారని తెలిపారు.

తదుపరి మంకర పంచాయతీలో ఇంటింటి ప్రచారం చేపట్టి, ముఖ్య కార్యకర్తల ఇళ్లను సందర్శించి వారితో సమావేశమయ్యామని చెప్పారు. సాయంత్రం కంజిరపుజా పంచాయతీలో సుమారు 2 కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ నిర్వహించామని వివరించారు.

ఈ ర్యాలీలో డాక్టర్ రేణు సురేష్ స్థానిక ప్రజలతో కలిసిమెలిసి మాట్లాడుతూ, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజలు ఆమెకు హృదయపూర్వక స్వాగతం పలుకుతూ పూర్తి మద్దతు ప్రకటించారని డాక్టర్ కిలారు దిలీప్ తెలిపారు. కొంగాడ్ నియోజకవర్గంలో బీజేపీ విజయం ఖాయమనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.



# ప్రజల ఆశీస్సులే ముఖ్యమంత్రి చంద్రబాబుకు శ్రీరామరక్ష

- ○ అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ○ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు కుప్పం ఓ ప్రయోగశాల
- ○ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి సమాజాభివృద్ధిలో మహిళలే కీలకం
- ○ ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి
- ○ కుప్పం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి నాలుగు రోజుల పర్యటన ప్రారంభం



**కుప్పం(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి, ప్రజలకు సంక్షేమం అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా ముందుగా కుప్పం నియోజకవర్గం నుంచే ముఖ్యమంత్రి మొదలుపెడతారని అన్నారు. సమాజాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర అని, వారు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని అన్నారు. మహిళల ఆర్థిక ఉన్నతికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని, వాటిని అందిపుచ్చుకుని వారంతా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా తొలి రోజు మంకలదొడ్డి, సింగారపురం, మొట్లచెను, కూసురు గ్రామాల్లో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో సమావేశమయ్యారు.

**కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటాం :** ముందుగా కుప్పం నియోజకవర్గం మంకలదొడ్డి గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని కాళికా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ...కుప్పం నియోజకవర్గ ప్రజలకు మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. ఇక్కడి ప్రజలు మమ్మల్ని ఎంతో ఆదరించారు. చంద్రబాబు గారిని 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. ముఖ్యమంత్రిగా ఆయన నియోకవర్గంలోని ప్రతి గ్రామం తిరగడం సాధ్యం కాదు కాబట్టి ఆ బాధ్యత నేను తీసుకున్నాను. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇక్కడ పర్యటిస్తున్నాను. గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నాను. గత ప్రభుత్వంలో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశాం. రాష్ట్రాన్ని బాగుచేయడం చంద్రబాబు గారి వల్లే అవుతుందనే నమ్మకంతో ప్రజలు గెలిపించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. నేను గతంలో పబ్లిక్ గా మాట్లాడింది లేదు. హెరిటేజ్ వ్యవహారాలు మాత్రమే చూసుకునేదాన్ని. నిజం గెలవాలి యాత్ర చేపట్టినప్పుడు రాష్ట్రప్రజలు , టీడీపీ నేతలు, కార్యకర్తలు నన్ను ముందుండి నడిపించారు. వారు అందించిన సహకారం నేను ఎప్పటికీ మర్చిపోలేను. సమాజం అభివృద్ధి చెందడంలో మహిళలదే ముఖ్యపాత్ర. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం శుభ పరిణామం. వారు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి. మహిళల ఆర్థిక ఉన్నతికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. పురుషులు తమ వృత్తిలో రాణించాలంటే కుటుంబ మద్దతు ఎంతో అవసరం. ప్రజాసేవలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కు నేను, మా కోడలు బ్రాహ్మణి పూర్తి సహకారం అందిస్తామని నారా భువనేశ్వరి తెలిపారు.

**కుప్పానికి పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు :** ఒక పరిశ్రమ పెట్టే ముందు పారిశ్రామికవేత్తలు లాభ,నష్టాలు బేరీజు వేసుకుంటారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి పరిశ్రమలు రాలేదు. కూటమి ప్రభుత్వంలో వచ్చాక సీఎం చంద్రబాబు గారి పాలనదక్షతపై నమ్మకంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలివస్తున్నాయి. 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు కుప్పం నియోజకవర్గానికి రూ. 7,121 కోట్ల విలువైన పెట్టుబడులతో 17 పరిశ్రమలు తీసుకొచ్చారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే నియోజకవర్గంలో రూ. 2,203 కోట్ల పెట్టుబడులతో 7 పరిశ్రమలు స్థాపించారు. వీటి ద్వారా 7093 మందికి ప్రత్యక్షంగా, 15,237 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కుప్పంలో అడిడాస్ కంపెనీ ఫుట్ వేర్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. మహిళలు స్వయం సమృద్ధి సాధించడం కోసం చంద్రబాబు గారు ఎలీప్ సంస్థను కుప్పానికి తీసుకొచ్చారు. ఇందులో శిక్షణ తీసుకున్న మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. కుప్పానికి హంద్రినీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టారు. స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేశారు. చెత్త ద్వారా సంపద సృష్టికి చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తెచ్చారు. మంకలదొడ్డి గ్రామానికి రోడ్ కనెక్టివిటీ నిమిత్తం రూ. 4 కోట్లకు పైగా వ్యయంతో బీటీ రోడ్లు వేశారని నారా భువనేశ్వరి తెలిపారు. కుప్పం మండలం టి.సదుమూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన నారా భువనేశ్వరి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. టి.సదుమూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

**గత పాలకులు రాష్ట్రాన్ని దోచేశారు :** సింగారపురంలో మారెమ్మ దేవాలయంలో పూజలు చేసిన అనంతరం నారా భువనేశ్వరి గ్రామంలోని మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ... గత పాలకులు రాష్ట్రాన్ని దోచేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల కష్టాలు తీరాయి. చంద్రబాబు గారు రాష్ట్ర ప్రజల కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. గత పాలకులు ఎంత బీభత్సం చేశారో చూశాం. ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయంటే అందుకు చంద్రబాబు గారిపై ఉన్న నమ్మకమే కారణం. కూటమి ప్రభుత్వం అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తోంది. యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తోంది. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. అనకాపల్లి జిల్లాలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకాబోతోంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. మహిళలు ఆర్థికంగా తమ సొంత కాళ్లపై నిలబడాలి. ప్రజా ప్రభుత్వం పీ4 ద్వారా పేదలను ఆర్థికంగా పైకి తెస్తోంది. కుప్పం నియోకవర్గంలో ప్రతి గ్రామానికి సంక్షేమం అందేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారు. సింగారపురం గ్రామానికి రూ. 23 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు వేయడం జరిగింది. స్థానికంగా బ్రిడ్జ్ నిర్మాణానికి నా వంతు కృషి చేస్తాను. కుప్పంలో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేస్తున్నారు. ఎలీప్ ద్వారా మహిళలు శిక్షణ తీసుకుని పారిశ్రామివేత్తలుగా ఎదగాలని నారా భువనేశ్వరి అన్నారు.

**కుప్పం అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేకదృష్టి :** కుప్పం మండలం మొట్లచెను గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి ముందుగా మాజీ ఎంపీటీసీ నివాసానికి వెళ్లారు. అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమం అందుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తున్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారు. ఏపీని కరువు రహిత రాష్ట్రంగా చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు. సంజీవని హెల్త్ క్లినిక్స్ ద్వారా పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారు. మొట్లచెను పంచాయతీల పరిధిలో 104 స్ట్రీట్ లైట్స్ అమర్చారు. సీఎంఆర్ ఎఫ్ కింద 5గురికి ఆర్థిక సాయం అందింది. జలజీవన్ మిషన్ కింద 100 ఇళ్లకు కుళాయి ద్వార సురక్షిత నీరు అందిస్తున్నారని నారా భువనేశ్వరి అన్నారు.

**పేదల అభ్యున్నతే లక్ష్యం :** కూసూరు గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించారని,ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో సీఎం చంద్రబాబు ముందుకెళు తున్నారు. ఒకప్పుడు విజన్ 2020 అంటే అందరూ ఎగతాళి చేశారు. కానీ చంద్రబాబు గారి పిలుపుతో ఐటీలో మన తెలుగువారు ప్రపంచమంతా ఉన్నత స్థానాల్లో ఉన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. మహిళలు తమపై నమ్మకం పెట్టుకుని ముందుకెళ్తే ఏదైనా సాధించగలరు. పిల్లల భవిష్యత్ పై ప్రతి మహిళా ప్రత్యేక దృష్టి పెట్టాలి. కుప్పంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారని నారా భువనేశ్వరి అన్నారు.

**జీవితంలో క్రమశిక్షణ ముఖ్యం :** కుప్పం మండలం పైపాల్యం గ్రామంలో విలువల బడి కార్యక్రమంలో పాల్గొన్న నారా భువనేశ్వరి గారు విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు చిన్నతనం నుంచి వినూత్నంగా ఆలోచించాలని సూచించారు. నేను చదువుకునేప్పుడు మోరల్ సైన్స్ సబ్జెక్ట్ ఉండేది. ఆ తర్వాత కాలంలో సబ్జెక్ట్ తీసేశారు. ఈ సబ్జెక్ట్ పెట్టాలని మంత్రి లోకేష్ గారిని కోరాను. మా నాన్న గారు పేద కుటుంబంలో పుట్టి కష్టపడి ఉన్నత స్థానానికి వచ్చారు. చిన్నతనంలో ఆయన సైకిల్ పై ఇంటింటింటి వెళ్లి పాలు అమ్మేవారు. వీధి దీపాల కింద కూర్చుని చదువుకునేవారు. చంద్రబాబు గారు కూడా చిన్నతనంలో కిలోమీటర్లు నడిచి బడికి వెళ్లేవారు. వృత్తిరీత్యా మా నాన్నగారు బిజీగా ఉండటంతో అమ్మే మాతో ఎక్కువ సమయం గడిపేవారు. మాకు విలువల గురించి చెప్పి పెంచారు. పిల్లల ఎదుగుదలలో తల్లి పాత్ర ముఖ్యమైంది. పిల్లలు అదే పనిగా సెల్ ఫోన్లు వాడటం ప్రమాదానికి దారితీస్తోంది. ఒకే ఇంట్లో ఉండి కూడా పిల్లలు తమ కుటుంబసభ్యులకు ఫోన్లో మెసేజ్ చేస్తున్నారు. టెక్నాలజీని అవసరానికే వాడాలి. మా చిన్నతనంలో ఫోన్లు, టీవీలు లేవు కాబట్టే సంతోషంగా ఉండేవారమని అనిపిస్తు ఉంటుంది. అన్ని మాకే తెలుసు అనే అహంభావం ఎవరికీ ఉండకూడదు. అహంకారం మనల్ని పాతాళానికి నెట్టేస్తుంది. పిల్లలు క్రమశిక్షణగా ఉండి, తల్లిదండ్రులను గౌరవించాలి. రానురాను ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై మనుషుల మధ్య దూరం పెరిగింది. మేము మొదటి నుంచి ఉమ్మడి కుటుంబం వల్లే మేమంతా కలిసిమెలిసి ఉంటున్నామని నారా భువనేశ్వరి తెలిపారు.

## అనంతపురం ఆర్‌డిటికి లైసెన్స్ పునరుద్ధరణ పట్ల మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** అనంతపురం జిల్లా అభివృద్ధిలో దశాబ్దాలుగా భాగస్వామిగా ఉన్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ( RDT) సంస్థకు కేంద్ర ప్రభుత్వం విదేశీ విరాళాల నియంత్రణ చట్టం లైసెన్స్‌ను పునరుద్ధరించడం హర్షణీయమని, దీనివల్ల విదేశీ నిధుల సేకరణకు ఉన్న అడ్డంకులు తొలగి జిల్లాలోని పేదలకు అందుతున్న విద్యా, వైద్య సేవలు మరింత బలోపేతమవుతాయని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రజా సేవలో నిమగ్నమైన సంస్థలకు కూటమి ప్రభుత్వ మద్దతు ఎప్పుడూ ఉంటుందని, దానికి ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

## సింగంపునరిలో బూత్ కమిటీలతో బీజేపీ వ్యూహాత్మక సమావేశం



**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమిళనాడు మధురై జోన్ పరిధిలోని తిరుప్పతూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. ఈ క్రమంలో సింగంపునరి సౌత్ మండల అధ్యక్షులు మురికేషన్ ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుప్పతూర్ అసెంబ్లీ ఇంచార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి బూత్‌లో ఓటర్లతో సాన్నిహిత్యం పెంచుకుంటూ, కేంద్ర ప్రభుత్వ పథకాలు మరియు పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. బూత్ కమిటీలు చురుకుగా పనిచేస్తే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తదనంతరం సింగంపునరి మండలంలోని కిరుంగకొట్టై గ్రామంలో 56వ బూత్ అధ్యక్షులు శరవణం శాంతి నివాసంలో బూత్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బూత్ ఓటర్ల జాబితాను అందజేశారు. అలాగే 57వ బూత్ అధ్యక్షురాలు విద్యాహరికృష్ణన్, 55వ బూత్ అధ్యక్షురాలు నందిని నివాసాలలో కూడా సమావేశాలు నిర్వహించి, పోలింగ్ బూత్ ఓటర్ల జాబితాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ సమన్వయకర్త రామేశ్వరం, అసెంబ్లీ ఇంచార్జ్ గణేశన్, చొక్కలింగం, జిల్లా కార్యదర్శి శాంతిని, జిల్లా ఉపాధ్యక్షులు ఏవి నాగరాజన్, శివగంగ జిల్లా ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్ఎం, ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ నడుమ ఎంవోయూ

○ హాజరైన కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ రఘు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ నడుమ వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. మంగళవారం యూనివర్సిటీలో డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ అండ్ ప్రొఫెషనల్ స్టడీస్ (డీప్స్) ఆధ్వర్యంలో జరిగిన ఎంవోయూ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ రఘు హాజరయ్యారు. విద్యార్థుల్లో ప్రజా నాయకత్వంతో పాటు సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యంగా రెండు సంస్థల మధ్య ఎంవోయూ జరిగినట్లు డాక్టర్ శ్రీనివాస్ రఘు పేర్కొన్నారు. ప్రస్తుతం 23 పబ్లిక్ సెక్టార్లతో కలిసి పని చేస్తున్న ఏపీ పీపీ ఎనర్జీ, ఇండస్ట్రీ మేనేజ్మెంట్ తో పాటు నైపుణ్య శిక్షణ, కెరీర్ డెవలప్మెంట్ కోర్సుల నిర్వహణలో ముందు వరుసలో ఉందన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీతో కలసి ఉపయుక్తమైన నిర్ణయాలు తీసుకుని ఎంవోయూ లక్ష్యాలను అధిగమించడం జరుగుతుందన్నారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ యూనివర్సిటీ ప్రత్యేకత, అభివృద్ధి, బోధనా పద్ధతులు, విద్యార్థులకు అందుబాబులో ఉంచిన కోర్సులు గురించి వివరించారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, ఏపీపీసీ డైరక్టర్ జనరల్ శ్రీనివాస రఘులు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీప్స్ డైరక్టర్ వెంకటేశ్వరన్ రామమూర్తి, అసోసియేట్ డైరెక్టర్ దువ్వూరి సత్యనారాయణ, యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ సీవీ టోమి , హెచ్ఆర్ డైరెక్టర్ ఐజక్ సామల, స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ మేజర్ జనరల్ గురుప్రీత్ సింగ్, ఏపీ ప్రొడక్టవిటీ కౌన్సిల్ ఇన్చార్జి కుర్రా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ○ అనర్హుల తొలగింపు, అర్హుల చేర్పే ఎస్ఐఆర్ లక్ష్యం
- ○ ప్రతి బూత్‌లో ఓటర్ల వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలి
- ○ బూత్ స్థాయిలో పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ జరగాలి
- ○ ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి
- ○ కార్యకర్తలకు బీజేపీ దిశానిర్దేశం





**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐఆర్ జిల్లా స్థాయి కార్యశాలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో ఉన్న ఓటర్ల వివరాలు బీఎల్ఏలకు పూర్తిగా తెలియాలని, ఎలాంటి అవకతవకలు ఉన్నా వెంటనే గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అప్పుడు మాత్రమే నిజమైన ఓటరు తన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రతి కార్యకర్త అత్యంత బాధ్యతతో తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయిలో బీఎల్ఏలు అప్రమత్తంగా పనిచేస్తూ ప్రతి ఓటరు వివరాలను సరిచూసి, అర్హులైన వారిని చేర్చడం, అనర్హులను తొలగించడం వంటి కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, నిజమైన ఓటరు తన హక్కును వినియోగించుకునేలా చేయడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ, ఏప్రిల్ 15 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభం కానున్న ఓటర్ లిస్టు ప్రత్యేక సమగ్ర సవరణపై బీఎల్ఏ-1, బీఎల్ఏ-2 నియామకం, క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం వంటి అంశాలపై విపులంగా చర్చించామని చెప్పారు.

ఎస్ఐఆర్ కొత్త ప్రక్రియ కాదని, 2002 నుంచి కొనసాగుతున్న సాధారణ విధానమేనని ఆయన వివరించారు. ఆధునిక సాంకేతికతతో అనర్హుల తొలగింపు పారదర్శకంగా జరుగుతుండటంతో ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తైందని, రాష్ట్రంలో ఏప్రిల్ 15 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

రాబోయే 90 రోజులపాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కంటే బీఎల్ఏలు మరింత అప్రమత్తంగా పనిచేసి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యుడు కెవి సుబ్బారావు, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ మకుటం శివ, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి సుబ్బారావు, ఎస్ఐఆర్ సహ కన్వీనర్లు కొమ్మినేని సత్యనారాయణ, భీమినేని చంద్రశేఖర్, వరికూటి వీరసుధాకర్, పాలపాటి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467